



# అక్షర రేఖ

తెలుగు దినపత్రిక

Simultaneously Published from Adilabad

RNI NO. TELTEL/2012/44706

సోమవారం 25 మే 2026 | Akshara Rekha Telugu Daily | వెల : 3/- | సంపుటి : 15 | సంచిక : 10 | పేజీలు : 8



## అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుగుతున్నాయి



ఇంధన సంక్షోభం వేళ గుడ్‌న్యూస్

## రాజస్థాన్‌లో భారీగా బయటపడ్డ నేచురల్ గ్యాస్ నిల్వలు

# హ్యామ్ రోడ్లకు గ్రీన్ సిగ్నల్

- రాష్ట్రవ్యాప్తంగా భారీ రహదారి విస్తరణకు మంత్రివర్గం శ్రీకారం
- హ్యామ్ రోడ్లకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్
- రాష్ట్రవ్యాప్తంగా భారీ రహదారి విస్తరణకు శ్రీకారం
- రూ.13 వేల కోట్లతో భారీ ప్రాజెక్టు
- గ్రామీణ రహదారులకూ ప్రాధాన్యం
- జూన్ 2న శంకుస్థాపన



హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో రహదారి మౌలిక వసతులను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్న హ్యామ్ (హైబ్రిడ్ అన్యుటీ మోడల్) రోడ్ల నిర్మాణానికి రాష్ట్ర మంత్రివర్గం పచ్చజెండా ఊపింది. ఈ ప్రాజెక్టు కింద మొత్తం 441 రహదారులను 34 ప్యాకేజీల్లో అభివృద్ధి చేయనున్నారు. సుమారు రూ.13,006.27 కోట్ల వ్యయంతో 6,092.37 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణం చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా రహదారి నెట్‌వర్క్‌ను మెరుగుపరచడంలో ఇది కీలక ముందడుగుగా - మిగతా3లో



## వారికి మాత్రమే టికెట్లు ఇస్తాం

- కేటీఆర్ సంచలన ప్రకటన..!!
- 2023 ఎన్నికల్లో సీట్ల విషయంలో చోటు చేసుకున్న పొరపాట్లతో ఈ సారి బీఆర్ఎస్ ముందస్తుగానే అప్రమత్తం
- పూర్తి స్థాయి సమాచారంతో సర్వేల ద్వారా ఎవరు గెలుస్తారో వారికే సీటు
- ప్రజల చుట్టూ తిరిగే నాయకులకు సర్వేల ఆధారంగానే టికెట్లు ఇస్తాం

## అకాల వర్షాలతో రైతులు ఆందోళన చెందవద్దు

- పౌర సరఫరాలు, భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- ధాన్యం సేకరణ వేగవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం
- తాలు, తరుగు పేరుతో కోతలు వేస్తే కఠిన చర్యలు తప్పవు
- రైతుకు నష్టం చేసే చర్యలను రాష్ట్ర ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించదు
- కాంటా కోసం వేచి ఉన్న 8.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలి
- కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని త్వరితగతిన మిల్లులకు తరలించాలని స్పష్టం



## లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ ప్రమాదంలో పడినా ప్రధాని మోదీ మౌనంగా ఉన్నారు

- నీట్ పేపర్ లీక్‌పై రాహుల్ గాంధీ ఫైర్
- నీట్-యూజీ పేపర్ లీక్‌పై ప్రధాని మోదీ మౌనంపై రాహుల్ గాంధీ విమర్శలు
- కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని మరోసారి డిమాండ్



## మక్కల కొనుగోళ్లకు మాది 'గ్యారంటీ'!

- మార్క్‌ఫెడ్‌కు రూ.1867 కోట్ల బ్యాంకు గ్యారంటీ ఇస్తూ సర్కారు నిర్ణయం
- ఇప్పటికే రూ.4,173 కోట్ల మేర గ్యారంటీ
- ఇచ్చి, రూ.3,100 కోట్ల విలువైన మక్కల కొనుగోలు
- నోడల్ ఏజెన్సీ మార్క్‌ఫెడ్ ద్వారా మక్కలతోపాటు జొన్న, పొద్దు తిరుగుడు పంటల సేకరణ



హైదరాబాద్

రాష్ట్రంలో మార్కెట్‌కు తరలివస్తున్న మక్కల కొనుగోళ్లకు అవసరమైన రుణాలు సమకూర్చుకునేందుకు మార్క్‌ఫెడ్‌కు రూ.1867.77 కోట్ల బ్యాంకు గ్యారంటీ ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. యాసంగి సీజన్ మక్కల కొనుగోళ్లకు నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తున్న మార్క్‌ఫెడ్‌కు ఇప్పటికే ప్రభుత్వం రూ.4,172.94 కోట్ల బ్యాంకు గ్యారంటీ ఇచ్చింది. దీంతో మక్కల కొనుగోళ్ల కోసం మార్క్‌ఫెడ్‌కు రూ.6,040.71 కోట్ల రుణాలు పొందేందుకు ప్రభుత్వం సహకారం అందించినట్టయ్యింది. మక్కలకు క్వింటాల్‌కు మద్దతు ధర రూ.2,400 - మిగతా3లో



## కేంద్ర మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఫిక్స్?

- కేంద్రంలో మోదీ సర్కార్ 12 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానానికి చేరుకుంటున్న వేళ..
- అటు కేబినెట్ ప్రక్షాళన, ఇటు దేశవ్యాప్తంగా భారీ ఉత్సవాలకు బీజేపీ అధిష్ఠానం పక్కా ప్లాన్ రెడీ
- ముఖ్యంగా రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సీనియర్లకు, అలాగే ఏపీ, బీహార్‌లోని మిత్రపక్షాలకు ఈ పునర్వ్యవస్థీకరణలో సముచిత స్థానం దక్కబోతున్నట్లు సమాచారం.

## కర్ణాటకలో విషాదం

### ఆల్చిప్పల కోసం నదిలో దిగి 8 మంది మృతి

- కర్ణాటక భట్కళ్‌లో నదిలో గల్లంతై 8 మంది మృతి
- ముత్యపు చిప్పల సేకరణకు వెళ్లగా పెరిగిన ప్రవాహంతో ప్రమాదం
- మృతుల్లో ఏడుగురు మహిళలు, ఒక పురుషుడు
- మరో ముగ్గురి కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలు
- మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల పరిహారం ప్రకటించిన సీఎం సిద్ధరామయ్య





## ఔటర్ చుట్టూ 10 ఫార్మా విలేజ్‌లు ఐదేళ్లలో 5 లక్షల కొత్త ఉద్యోగాలు

- 2026-2030 మధ్య 25 బిలియన్ డాలర్ల పెట్టుబడులు
- ఔటర్ చుట్టూ పది ఫార్మా విలేజ్‌లు లైఫ్ సైన్సెస్ ఇన్నోవేషన్ ఫండ్ ఏర్పాటు
- తెలంగాణ నెక్స్ట్‌జెన్ లైఫ్ సైన్సెస్ విధానానికి కేబినెట్ ఆమోదం

# కేంద్ర మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఫిక్స్?



మోదీ 3.0 ప్రభుత్వం మరో కొన్ని రోజుల్లో రెండేళ్ల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకోనుంది. ఈ కీలక మైలురాయిని పురస్కరించుకుని కేంద్రమంత్రివర్గంలో భారీ మార్పులు, చేర్పులకు అంతర్గతంగా చకచకా సన్నాహాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే గత శాఖల వారీగా మంత్రుల పనితీరుపై ప్రధాని మోదీ క్షుణ్ణంగా సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పథకాల అమలు, లక్ష్యాల సాధన, పరిపాలనా బాధ్యతల్లో ఎక్కడైనా లోపాలు ఉంటే వాటిపై ప్రత్యేక దృష్టి సారించారు. కొన్ని శాఖల పేలవమైన పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ప్రధాని.. మంత్రులు, అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. దేశ పురోభివృద్ధే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సైనిక క్రమశిక్షణతో పని చేయాలని, ప్రజాధనాన్ని వీలైనంతగా పొదుపు చేయాలని స్పష్టం చేశారు. మారుతున్న అంతర్జాతీయ పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వ వ్యవస్థ పనితీరు మారాలని, వికసిత భారత్ లక్ష్యం కోసం రంగాల వారీగా దూసుకుపోవాలని మోదీ పిలుపునిచ్చారు.

**20 నుంచి 30 మంది మంత్రుల మార్పు..**

ఈసారి జరగబోయే పునర్వ్యవస్థీకరణలో దాదాపు 20 నుంచి 30 మంది మంత్రుల వరకు మార్పులు చేర్పులు ఉండవచ్చని ఢిల్లీ వర్గాల సమాచారం. పనితీరు సరిగ్గా లేని కొందరు సీనియర్లను తప్పించి, వారి స్థానంలో కొత్త ముఖాలకు, ముఖ్యంగా యువత, మహిళలకు కేబినెట్‌లో చోటు కల్పించే యోచనలో బీజేపీ అధిష్ఠానం ఉంది. గతంలో మోదీ 2.0 హయాంలో జూలై 7, 2021న జరిగిన అతిపెద్ద కేబినెట్ ప్రక్షాళనలో 43 మంది కొత్త మంత్రులు ప్రమాణం చేయగా, 12 మంది సీనియర్లకు ఉద్వాసన పలికారు. ఇప్పుడు కూడా అదే తరహాలో గట్టి నిర్ణయాలు తీసుకోనున్నారు. అయితే రాబోయే రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, సామాజిక సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని, క్షేత్రస్థాయిలో పట్టున్న కొందరు అనుభవజ్ఞులైన సీనియర్ నేతలకు మళ్లీ కేబినెట్‌లో చాన్స్ ఇవ్వనున్నారు.

**ఏడు రాష్ట్రాల ఎన్నికలే టార్గెట్..**

రాబోయే 2027 నాటికి దేశంలోని ఏడు కీలక రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో భాగంగా వచ్చే ఏడాది ఫిబ్రవరి-మార్చి నెలల్లోనే ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్, గోవా, మణిపూర్ రాష్ట్రాలకు.. అలాగే ఈ ఏడాది నవంబర్-డిసెంబర్‌లో గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ ఎన్నికలను బీజేపీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటుండటంతో ఆయా రాష్ట్రాల నుంచి గెలిచిన నేతలకు కేంద్ర కేబినెట్‌లో సముచిత స్థానం దక్కనుంది. మరోవైపు దక్షిణాది రాష్ట్రాల్లో పార్టీని మరింత బలోపేతం చేయాలనే వ్యూహంలో భాగంగా తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా కొందరు కీలక నేతలకు మంత్రివర్గంలో ప్రాధాన్యత ఇచ్చే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.

**పార్టీ లైన్‌లో సంస్థాగత మార్పులు..**

జూన్ 9 నాటికి మోదీ ప్రభుత్వం కేంద్రంలో 12 ఏళ్ల సుదీర్ఘ పాలనను పూర్తి చేసుకోనుంది. ఈ లోపే బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నవీన్ తన నూతన కార్యవర్గాన్ని ప్రకటించే అవకాశం ఉంది. ఇటీవల ఐదు రాష్ట్రాల ఎన్నికల వల్ల ఈ ప్రక్రియ ఆలస్యమైంది. అలాగే యూపీలో కొత్తగా ఎన్నికైన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పంకజ్ చౌదరి కూడా తన కొత్త టీమ్‌ను ప్రకటించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రివర్గం నుండి ఉద్వాసనకు గురయ్యే సీనియర్ నేతలను జాతీయ స్థాయిలో నితిన్ నవీన్ టీమ్‌లోకి తీసుకునే చాన్స్ ఉంది. దీనివల్ల ప్రభుత్వంలో బాధ్యతలు తగ్గినా.. పార్టీ పరంగా వారికి తగిన గౌరవం ఇచ్చినట్లు అవుతుందని బీజేపీ భావిస్తోంది. అలాగే మోదీ 3.0 లో ఉన్న మిత్రపక్షాల సూచనల మేరకు కేంద్ర మంత్రివర్గంలో మార్పులు ఉంటాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాల నుంచి మిత్రపక్షాల నేతలకు కేబినెట్‌లో మరికొన్ని కీలక పదవులు దక్కే అవకాశాలు ఉన్నాయి.

**12 ఏళ్ల పాలన.. దేశవ్యాప్తంగా బీజేపీ భారీ ఉత్సవాలు..**

కేంద్రంలో మోదీ సర్కార్ 12 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంటున్న సందర్భంగా జూన్ 5 నుంచి 21 వరకు "12 ఏళ్ల విశ్వాసం-వికాసం-జన సంక్షేమం" పేరిట దేశవ్యాప్తంగా భారీ ఎత్తున వేడుకలు నిర్వహించాలని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నవీన్ రాష్ట్రాల అధ్యక్షులను ఆదేశించారు. జూన్ 8, 9 తేదీల్లో ఢిల్లీలో భారీ మీడియా సంవాద్ కార్యక్రమం, జూన్ 11, 12 తేదీల్లో ఎన్డీయే ముఖ్యమంత్రులు, మంత్రుల ప్రత్యేక సమావేశం జరగనుంది. ప్రత్యేక జనసంపర్క ప్రచారంలో భాగంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు ఒక రోజంతా గడపనున్నారు. మూడు రోజుల పాటు జన సంక్షేమ శిబిరాలు నిర్వహించి ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల నమోదు కోసం ప్రత్యేక డ్రైవ్‌లు చేపడతారు. జూన్ 5న అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమాన్ని, జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రతి మండలంలో భారీగా నిర్వహించనున్నారు. ప్రస్తుతం దేశంలో ఉన్న ఇంధన సంక్షేమ పరిస్థితుల దృష్ట్యా నేతలు వ్యక్తిగత కాన్వాయ్‌లు కాకుండా కార్ పూలింగ్ లేదా ప్రజా రవాణాను వాడాలని అధిష్ఠానం కఠిన ఆదేశాలు జారీ చేసింది. అలాగే కేవలం స్వదేశీ ఉత్పత్తులనే ప్రోత్సహించాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసింది.

## అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుగుతున్నాయి

అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుగుతున్నాయని భారత విదేశాంగ మంత్రి జైశంకర్ అన్నారు. త్వరలోనే అమెరికా బృందం భారత్‌కు రాబోతోందని వెల్లడించారు. ఒప్పందంలోని కొన్ని అంశాలపై భారత్ అభ్యంతరం చెబుతోందని, 140 కోట్ల భారతీయుల ప్రయోజనాలే మాకు ముఖ్యమని చెప్పారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోతో కలిసి నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో ఈ మేరకు వ్యాఖ్యానించారు. "రక్షణ, భద్రతా సహకారం విషయానికి వస్తే, 10 ఏళ్ల ప్రధాన రక్షణ భాగస్వామ్య ఫ్రేమ్‌వర్క్ ఒప్పందం ఇటీవల పునరుద్ధరించాం. సమగ్రమైన జలాంతర్గత డొమైన్ అవగాహన రోడ్‌మ్యాప్‌పై కూడా సంతకాలు జరిగాయి. రక్షణ రంగంలో ముందుకు సాగే క్రమంలో 'మేక్ ఇన్ ఇండియా' విధానాన్ని, ఇటీవలి సంఘర్షణల నుంచి నేర్చుకున్న పాఠాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన ప్రాముఖ్యంపై చర్చించాము. ఆర్థిక రంగంలో పరస్పర, ఉభయ ప్రయోజనకరమైన వాణిజ్యానికి సంబంధించిన మధ్యంతర ఒప్పందం తుది ముసాయిదాను త్వరగా ఖరారు చేయడంపైనా మాట్లాడాము. 2025 ఫిబ్రవరిలో ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా సమగ్ర ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం దిశగా ఇది ఒక ముఖ్యమైన ముందడుగు అవుతుంది. ఇటీవల మా బృందం వాషింగ్టన్‌లో పర్యటించగా, త్వరలోనే అమెరికన్ బృందం భారత్?ను సందర్శిస్తుందని మేము ఆశిస్తున్నాము. ఈ రోజు మేము ఇంధన సమస్యలపై కొంత సమయం చర్చించాము. 140 కోట్ల మంది ప్రజల అవసరాలను తీర్చడం మా ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత. వారికి ఇంధనం అందుబాటులో సరసమైన ధరలకు లభించేలా చూడటమే మా ప్రధాన కర్తవ్యం. అందువల్ల, ఇటీవలి నెలల్లో మన ఇంధన వాణిజ్యం విస్తరించడాన్ని స్వాగతిస్తున్నాము."

**గల్ఫ్ సంక్షోభం, రష్యా- ఉక్రెయిన్ యుద్ధంపై చర్చించాం: రూబియో**

భారత్‌లో పర్యటించడం గర్వకారణమని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో అన్నారు. భారత్, అమెరికా ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలని కొనియాడారు. ఉగ్రవాదంపై పోరులో భారత్, అమెరికా కలిసి నడుస్తాయని, రెండూ ఉగ్రవాదబాధిత దేశాలేనని చెప్పారు. ఇరుదేశాలు వ్యూహాత్మాక భాగస్వాములని అన్నారు. గల్ఫ్ సంక్షోభం, రష్యా- ఉక్రెయిన్ యుద్ధంపై చర్చించామని వివరించారు. అమెరికా- భారత్ సంబంధాలు బలపడుతున్నాయని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో అన్నారు. ప్రపంచవ్యాప్తంగా అమెరికాకు అత్యంత ముఖ్యమైన వ్యూహాత్మక భాగస్వాముల్లో భారత్? ఒకటిగా ఉందని చెప్పారు. ఈ రెండు ప్రజాస్వామ్య దేశాల మధ్య సంబంధం సంప్రదాయ దౌత్య సంబంధాలకు అతీతమైనదని అభిప్రాయపడ్డారు. "మా వాణిజ్య ప్రతినిధి త్వరలోనే భారత్?కు వస్తారు. గత వారం భారతీయ ప్రతినిధి బృందం అమెరికాను సందర్శించింది. మేము అద్భుతమైన పురోగతిని సాధించాము. అమెరికా, భారత్? మధ్య కుదిరే వాణిజ్య ఒప్పందం సుదీర్ఘకాలం నిలిచి ఉండేలా, ఇరు పక్షాలకూ ప్రయోజనకరంగా సుస్థిరంగా ఉంటుందని నేను విశ్వసిస్తున్నాను. అంతేకాకుండా, మేము అనేక ఇతర రంగాల్లో కూడా మా సహకారాన్ని కొనసాగిస్తున్నాం. ఉదాహరణకు మా విదేశాంగ శాఖ ప్రతిపాదనను వెలువరించినప్పుడు దానికి మద్దతుగా చేరిన తొలి దేశాల్లో భారతదేశం ఒకటి." అని మార్కో రూబియో అన్నారు. మరోవైపు ఇరాన్‌తో శాంతి ఒప్పందానికి సంబంధించి కీలక వ్యాఖ్యలు చేశారు మార్కో రూబియో. ఇరాన్‌తో శాంతి ఒప్పందానికి సంబంధించి మరికొన్నిగంటల్లోనే ప్రపంచానికి ఒక 'శుభవార్త' అందే అవకాశం ఉందని చెప్పారు. ఈ అంశంపై ట్రంప్ ప్రకటన చేస్తారని తెలిపారు. ఇరాన్ అణ్వాయుధాలు కలిగి ఉండకూడదనేది తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. హర్మూజ్ జలసంధిలో ఇరాన్ ఆధిపత్యాన్ని తప్పుపట్టారు. "ఇరాన్ పరిస్థితిపై, ఈ రోజు కాస్త ఆలస్యంగా ఈ అంశంపై మరికొన్ని వార్తలు వస్తాయని నేను భావిస్తున్నాను. దీనిపై మరిన్ని ప్రకటనలు చేయడానికి నేను అధ్యక్షుడు ట్రంప్‌కే వదిలేస్తున్నాను. కొంత పురోగతి సాధించాం. అది పూర్తిగా కాకపోయినా గణనీయమైన పురోగతి అని అనుకుంటున్నా. ఇక్కడ అంతిమ లక్ష్యం ఏంటంటే ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని కలిగి ఉండకూడదు. అమెరికా అధ్యక్షుడిగా ఉన్నంత కాలం ఇరాన్ కచ్చితంగా అణ్వాయుధాన్ని కలిగి ఉండదని ట్రంప్ దీనిపై స్పష్టంగా ఉన్నారు. మరొక సమస్య హర్మూజ్ జలసంధికి సంబంధించింది. ఇది అంతర్జాతీయ జలమార్గం. దీనిపై ఇరాన్‌కు ఎలాంటి యాజమాన్య హక్కులు లేవు. వారు ఒక అంతర్జాతీయ జలమార్గాన్ని ఉపయోగించే వాణిజ్య నౌకలను నాశనం చేస్తామని బెదిరిస్తున్నారు. ట్రంప్ ప్రాధాన్యత ఏంటంటే, ఈ సమస్యలను పరిష్కరించడానికి ఒక దౌత్యపరమైన మార్గాన్ని కనుగొనడం. అధ్యక్షుడి ప్రాధాన్యం ఎప్పుడూ అదే విధంగా ఉంటుంది." అని మార్కో రూబియో అన్నారు.

## కర్ణాటకలో విషాదం...

కర్ణాటకలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఉత్తర కన్నడ జిల్లా భట్కళ్ తాలూకాలోని వెంకటాపుర నదిలో ముత్యపు చిప్పలు సేకరించేందుకు వెళ్లిన 14 మందిలో 8 మంది నీటిలో కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురి ఆచూకీ లభించకపోవడంతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనలో ముగ్గురిని సురక్షితంగా కాపాడారు. వివరాల్లోకి వెళ్తే, శిరాలి ప్రాంతంలోని పడుశిరాలి గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన 14 మంది ఆదివారం వెంకటాపుర నదిలో ముత్యపు చిప్పలు (ఆల్చిప్పలు) సేకరించేందుకు వెళ్లారు. ఇటీవల కురిసిన వర్షాలకు నదిలో నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరగడంతో వారు అదుపుతప్పి కొట్టుకుపోయారు. సమాచారం అందుకున్న వెంటనే స్థానికులు, భట్కళ్ గ్రామీణ పోలీసులు, సహాయక బృందాలు రంగంలోకి దిగాయి. ఈ దుర్ఘటనలో మరణించినవారిని లక్ష్మీ మహాదేవ నాయక్ (38), లక్ష్మీ శివరామ్ నాయక్ (39), ఉమేష్ మంజునాథ్ నాయక్ (42), మస్తమ్మ మంజునాథ్ నాయక్ (43), లక్ష్మీ అన్నప్ప నాయక్ (44), జ్యోతి నాగప్ప నాయక్ (37), మాలతి జట్టప్ప నాయక్ (38)గా గుర్తించారు. మరొకరి వివరాలు తెలియాల్సి ఉంది. వీరి మృతదేహాలను వెలికితీసి భట్కళ్, మురుడేశ్వర్‌లోని ఆసుపత్రులకు తరలించారు. మరో ముగ్గురు మాదేవ జట్టప్ప నాయక్ (52), మంజమ్మ గొట్ట నాయక్ (50), నాగరత్న పరమేశ్వర్ నాయక్ (40) కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. గాయపడిన ఇద్దరు మహిళలను మెరుగైన చికిత్స కోసం ఉడుపిలోని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ ప్రమాదంలో పడినా ప్రధాని మోదీ మౌనంగా ఉన్నారు



నీట్-యూజీ 2026 పేపర్ లీక్ వివాదంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మౌనం వహించడాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా విమర్శించారు. వరుసగా జరుగుతున్న నీట్ పేపర్ లీక్‌లకు ప్రభుత్వ ఉదాసీనతే కారణమని పేర్కొన్నారు. అందుకే దీనికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే పదవి నుంచి తప్పుకోవాలని మరోసారి డిమాండ్ చేశారు. తెలంగాణలోని హైదరాబాద్‌లో నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్‌యూఐ) ఆధ్వర్యంలో జరిగిన నిరసన వీడియోను జతచేస్తూ రాహుల్ ఎక్స్ వేదికగా ఓ పోస్టు పెట్టారు. అందులో రాహుల్ ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించారు.

"లక్షలాది మంది యువకులు రోడ్లపైకి వచ్చినప్పుడు, 22 లక్షల మంది పిల్లల భవిష్యత్ ప్రమాదంలో పడినప్పుడు కూడా ప్రధాని మోదీ మౌనంగా ఉంటున్నారు. అంటే ఈ ప్రభుత్వం సమాధానం చెప్పడంపై కాకుండా, తప్పించుకోవడంపైనే దృష్టి పెట్టింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసి, నీట్ వంటి పేపర్ లీక్?లను అరికట్టడానికి ఒక పటిష్టమైన వ్యవస్థ ఏర్పాటు చేసే వరకు మేము విశ్రమించం."

**పేపర్ లీక్ మాఫియా వర్ధిల్లుతోంది!**

నీట్ పేపర్ లీక్‌కు నిరసనగా ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు వినోద్ జాఖర్ ఆధ్వర్యంలో ఆ సంస్థ సభ్యులు హైదరాబాద్‌లో పాదయాత్ర నిర్వహించారు. యువజన వ్యతిరేక విధానాలను అవలంబిస్తే ఊరుకునేది లేదని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇక కాంగ్రెస్ పార్టీ కూడా ఈ సమస్యపై స్పందిస్తూ, రాహుల్ గాంధీ షేర్ చేసిన వీడియోనే రీషేర్ చేసింది. నీట్ పేపర్ లీక్ అనేది లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్‌ను చీకట్లోకి నెట్టేసిందని పేర్కొంది.

"మోదీ ప్రభుత్వంలో పేపర్ లీక్ మాఫియా వర్ధిల్లుతోంది. కానీ బాధ్యత వహించాల్సినవారు మాత్రం కూర్చొని వేడుక చూస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో జరుగుతున్న ఈ చలగాటాన్ని మేము ఎంత మాత్రం సహించం. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి. దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలి."

**విద్యార్థుల కలలపై దాడి!**

నీట్ పేపర్ లీక్ సమస్యపై ఎన్ఎస్‌యూఐ తనదైన రీతిలో స్పందించింది. నీట్-యూజీ 2026 పేపర్ లీక్ అనేది '22 లక్షల మంది విద్యార్థుల కలలపై జరిగిన దాడి' అని అభివర్ణించింది. విద్యార్థుల భవిష్యత్‌తో చలగాటమాడడాన్ని ఇకపై సహించేది లేదని, ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. నీట్ పేపర్ లీక్‌కు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది.

**రీ-నీట్**

మే 3న నిర్వహించిన నీట్-యూజీ 2026 పరీక్ష పేపర్ లీక్ అయ్యిందని మొదట్లో వార్తలు వచ్చాయి. దీనితో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆ ఆరోపణలను పరిశీలించి, పేపర్ లీక్ అయినట్లు ధ్రువీకరించి మే 12న పరీక్షను రద్దు చేసింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రధాన్ కూడా గెస్ పేపర్లు బయటకు వెళ్లాయని అంగీకరించారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించింది. మరోవైపు ధర్మేంద్ర ప్రధాన్ ఎన్‌టీఏ జవాబుదారీతనాన్ని సమర్థిస్తూనే, జూన్ 21న రీ-టెస్ట్ పెడతామని ప్రకటించారు. ఎలాంటి తప్పులు, అక్రమాలకు తావులేకుండా 100 శాతం పారదర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు. పేపర్ లీకేజీల వల్ల నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో మరోసారి పేపర్ లీక్ లాంటివి జరగకుండా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (చీూ) జీరో ట్రస్ట్ (ఎవరినీ నమ్మకూడదనే) విధానంతో ముందుకెళ్తోంది. కాగా, నీట్? పేపర్ లీక్ అయిన నేపథ్యంలో, ఈ పరీక్ష నిర్వహణ బాధ్యతలను ఎయిమ్స్-ఢిల్లీకి అప్పగించాలనే డిమాండ్లు కూడా వెల్లువెత్తాయి.

# ఇంధన సంక్షోభం వేళ గుడ్‌న్యూస్ రాజస్థాన్‌లో భారీగా బయటపడ్డ నేచురల్ గ్యాస్ నిల్వలు

ఇరాన్- అమెరికా మధ్య యుద్ధం కారణంగా ప్రపంచ వాణిజ్యానికి గుండెకాయ లాంటి హర్మూజ్ జలసంధిని ఇరాన్ మూసివేసిన నేపథ్యంలో చమురు, గ్యాస్ సరఫరా నిలిచిపోయి ప్రపంచ దేశాలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. ఇప్పటికే భారత్‌లో వారం రోజుల వ్యవధిలో పెట్రోల్, డీజిల్ ధరలు మూడు సార్లు పెరిగాయి. అలాగే గ్యాస్ బుకింగ్, డెలివరీ విధానంలోనూ పలు మార్పులు సంభవించాయి. అయితే ఈ సంక్షోభ సమయంలో భారత్‌కు ఒక గుడ్‌న్యూస్. రాజస్థాన్‌లోని జైసల్మేర్ బేసిన్‌లోని దండేవాలా క్షేత్రం (ఫీల్డ్)లో సహజ వాయువు నిల్వలు భారీగా బయటపడ్డాయి. ప్రభుత్వ రంగ ఇంధన సంస్థ అయిన ఆయిల్ ఇండియా లిమిటెడ్ ఈ ప్రాంతంలో గ్యాస్ నిల్వలు ఉన్న ఒక కొత్త పే జోన్‌ను విజయవంతంగా కనుగొంది. దీంతో దండేవాలా క్షేత్రం ద్వారా దేశం ఇంధన రంగంలో ఒక కీలకమైన పురోగతిని సాధించింది.

**ఆయిల్ ఇండియా లిమిటెడ్ ప్రకారం**

దండేవాలా క్షేత్రంలో తక్కువ లోతులో ఉండే సాను ఫార్మేషన్ అనే పొరలో తొలిసారిగా సహజవాయువు నిల్వలు ఉన్నట్లు ఆయిల్ ఇండియా లిమిటెడ్ సైంటిస్టులు గుర్తించారు. ప్రస్తుతం ఈ గ్యాస్ క్షేత్రం రోజుకు సగటున 25,000 స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ల సహజ వాయువును ఉత్పత్తి చేస్తోంది. ఈ ప్రాథమిక ఉత్పత్తి ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉన్నాయి. విస్తృతమైన పరీక్షలు, అభివృద్ధి కార్యకలాపాల తర్వాత సహజ వాయువు ఉత్పత్తి సామర్థ్యం మరింత పెరగొచ్చు. ఈ విజయం దేశ ఇంధన స్వయం సమృద్ధి దిశగా పడిన ఒక పెద్ద ముందడుగుగా ఇంధన రంగ నిపుణులు అభివర్ణించారు.



చమురు, గ్యాస్ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడానికి భారత్ చాలా కాలంగా ప్రయత్నిస్తోందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో కొత్త దేశీయ సహజ వాయువు నిల్వలను కనుగొనడం, ఉత్పత్తిని ప్రారంభించడం ఇంధన భద్రతకు ఒక సానుకూల సంకేతంగా పనిచేస్తుందని కొనియాడారు. ఈ చౌరవ దేశీయంగా సహజ వాయువు లభ్యతను పెంచడానికి, దిగుమతులపై చేసే వ్యయాన్ని తగ్గించడానికి సహాయపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ ఆవిష్కరణ రాజస్థాన్‌లో పెట్టుబడి, ఉపాధి అవకాశాలను పెంచుతుందని భావిస్తున్నారు.

**'దేశ ఇంధన రంగానికి దక్కిన విజయం'**

దండేవాలా క్షేత్రంలో నేచురల్ గ్యాస్ నిల్వలను ఆయిల్ ఇండియా లిమిటెడ్ కనుగొనడంపై కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీ సంతోషం వ్యక్తం చేశారు. ఇది దేశ ఇంధన రంగానికి దక్కిన ఒక ముఖ్యమైన విజయంగా అభివర్ణించారు. ఈ క్రమంలో ఆయిల్ ఇండియా లిమిటెడ్ బృందాన్ని అభినందించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం ఇంధన భద్రత, స్వయం సమృద్ధి దిశగా నిరంతరం పురోగమిస్తోందని కొనియాడారు. దేశీయ ఇంధన స్వయం సమృద్ధి లక్ష్యాన్ని సాధించడంలో ఇటువంటి ఆవిష్కరణలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. "దేశీయ ఇంధన ఉత్పత్తిని బలోపేతం చేయాలన్న భారత్ ప్రయత్నం రాజస్థాన్‌లో ఒక కొత్త అధ్యాయాన్ని లిఖిస్తోంది. ఆయిల్ ఇండియా లిమిటెడ్ దండేవాలా క్షేత్రంలో కొత్త గ్యాస్ నిల్వలున్న పే జోన్‌ను విజయవంతంగా కనుగొంది. ప్రధాని నరేంద్ర మోదీ మార్గదర్శకత్వం, నాయకత్వంలో తక్కువ లోతులో ఉన్న సాను ఫార్మేషన్ నుంచి రోజుకు దాదాపు 25,000 స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ల సహజ వాయువు తొలిసారిగా విడుదల కావడం ఇంధన స్వయం సమృద్ధి దిశగా భారత్ సాగిస్తున్న ప్రయాణానికి మరింత ఊపునిస్తుంది. ఆయిల్ ఇండియా లిమిటెడ్ బృందం పట్టుదల, సాంకేతిక నైపుణ్యం, అచంచలమైన నిబద్ధతకు అభినందనలు" అని హర్దీప్ సింగ్ పూరీ ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అధునాతన అన్వేషణ పద్ధతులు, సాంకేతిక నైపుణ్యాన్ని ఉపయోగించుకోవడమే ఈ విజయానికి కారణమని ఆయిల్ ఇండియా లిమిటెడ్ స్పష్టం చేసింది. రాజస్థాన్‌లోని దండేవాలా క్షేత్రంలో సాధించిన ఈ చారిత్రక విజయానికి ప్రోత్సాహం, మద్దతు అందించిన కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీకి ధన్యవాదాలు తెలియజేసింది. ఆత్మనిర్భర్ భారత్ దార్శనికతకు అనుగుణంగా నిరంతర అన్వేషణ ప్రయత్నాలు, సాంకేతిక నైపుణ్యంతో దేశీయ హైడ్రోకార్బన్ ఉత్పత్తిని పెంచడం ద్వారా దేశ ఇంధన భద్రతను పెంపొందించడానికి ఆయిల్ ఇండియా లిమిటెడ్ కట్టుబడి ఉందని పేర్కొంది.

# హ్యామ్ రోడ్లకు గ్రీన్ సిగ్నల్

-మొదటిపేజీ తరువాయి

భావిస్తున్నారు. హ్యామ్ టెండర్లకు సంబంధించిన ఫైనాన్షియల్ బిడ్లను ఇటీవల అధికారులు తెరిచినప్పుడు పలువురు గుత్తేదారులు అంచనా వ్యయాన్ని మించి ధరలను కోట్ చేసినట్లు తెలిసింది. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కఠినంగా స్పందించినట్లు సమాచారం. ప్రాజెక్టుల వ్యయం 5 శాతానికి మించి పెరగకూడదని ముఖ్యమంత్రి స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. దీంతో అధికారులు మరోసారి నివేదికల్లో మార్పులు చేసి మంత్రివర్గం ముందు సమర్పించారు. ప్రభుత్వం ప్రజాధనాన్ని ఆదా చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఈ నిర్ణయం సూచిస్తోంది.



### గుత్తేదారులకు ప్రభుత్వ మద్దతు

హ్యామ్ మోడల్లో గుత్తేదారులు తమ వాటాగా 60 శాతం పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో వారికి కొన్ని ఆర్థిక సడలింపులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గుత్తేదారుల వాటాపై వర్తించే జీఎస్టీకి ప్రభుత్వం మినహాయింపు ఇవ్వాలని నిర్ణయించింది. దాదాపు 9.30 శాతం మేర జీఎస్టీ మొత్తాన్ని రీయింబర్స్ చేయనున్నట్లు సమాచారం. అలాగే రహదారుల నిర్వహణలో భాగంగా అవసరమయ్యే పెట్రోలింగ్, అంబులెన్స్ వాహనాల ఖర్చు సుమారు 4.46 శాతం వరకు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఇకపై ఈ వాహనాలను ప్రభుత్వమే సమకూర్చాలని నిర్ణయించారు. ఈ చర్యల వల్ల గుత్తేదారులపై ఆర్థిక భారం తగ్గి, అదనపు కోట్ 5 శాతంలోపే ఉండేలా అవకాశం ఏర్పడనుంది.

### సిద్దిపేటలో అత్యధిక ఎక్సెస్

ఆర్అండ్బీ శాఖ టెండర్లలో వచ్చిన అదనపు కోట్ల వివరాలను కూడా అధికారులు మంత్రివర్గం ముందు ఉంచారు. అందులో అత్యధికంగా సిద్దిపేట జిల్లాలో కీస్టోన్ ఇన్ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ 75 శాతం అదనపు కోట్ చేసినట్లు సమాచారం. మరోవైపు అత్యల్పంగా ఖమ్మం-2 ప్యాకేజీలో మేఘా సంస్థ 14.40 శాతం మాత్రమే కోట్ చేసినట్లు తెలిసింది. ఈ తేడాలు ప్రాజెక్టు వ్యయాలపై చర్చకు దారి తీశాయి.

### గ్రామీణ రహదారులకూ ప్రాధాన్యం

కేవలం ప్రధాన రహదారులకే కాకుండా గ్రామీణ ప్రాంతాల రోడ్ల అభివృద్ధిపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో తొలి దశలో 2,162 గ్రామాల్లోని రహదారులను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. మొత్తం 7,450 కిలోమీటర్ల మేర 17 ప్యాకేజీలుగా పనులు చేపట్టేందుకు మంత్రిమండలి అనుమతులు ఇచ్చింది. వెంటనే పనులు ప్రారంభించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి.

### జూన్ 2న శంకుస్థాపనకు సిద్ధం

రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ 2న ఈ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టులు పూర్తి అయితే రాష్ట్రంలో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అనుసంధానం మరింత బలపడే అవకాశం ఉంది.

# ఔటర్ చుట్టూ 10 ఫార్మా విలేజ్‌లు
# ఐదేళ్లలో 5 లక్షల కొత్త ఉద్యోగాలు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2030 నాటికి ఐదు ప్రపంచ శ్రేణి లైఫ్ సైన్సెస్ సెంటర్లలో ఒకటిగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయనుంది. ఫలితంగా ఈ రంగంలో రానున్న ఐదేళ్ల కాలంలో కొత్త ఉద్యోగాలు కల్పించే తెలంగాణ నెక్స్?జెన్ లైఫ్ సైన్సెస్ విధానాన్ని రాష్ట్ర కేబినెట్ ఆమోదించింది. గ్రీన్ ఫార్మాసిటీలను ఏర్పాటు చేయడంతో పాటు వికేంద్రీకరణ, రీసెర్చ్ అండ్ డెవలప్?మెంట్, తయారీ, సేవలు, నూతన ఆవిష్కరణలు, సమగ్ర, సమతౌల్యంతో కూడిన పారిశ్రామిక అభివృద్ధిని తెలంగాణ రాష్ట్రంలో చేయనననట్లుగా సమాచారం. 2026-2030 మధ్య కనీసం 25 బిలియన్ అమెరికా డాలర్ల పెట్టుబడులను ఆకర్షించేవిదంగా లక్ష్యాన్ని పెట్టుకుంది. లైఫ్ సైన్సెస్ ఆవిష్కరణలకు ప్రపంచ కేంద్రంగా తెలంగాణ రాట్ట్రాన్ని నిలబెట్టేందుకు ఈ విధానాన్ని సిద్ధం చేసింది. సమతుల, వికేంద్రీకృత, సమగ్ర పారిశ్రామికాభివృద్ధి కోసం ఔటర్ రింగ్ రోడ్ చుట్టూ(ఓఆర్?ఆర్?) 1,000 నుంచి 3,000 ఎకరాల విస్తీర్ణంలో 10 ఫార్మా విలేజ్‌లను అభివృద్ధి చేయనుంది. క్లినికల్ పరిశోధనలు, డయాగ్నస్టిక్స్, మెడికల్ ఆరోగ్య సంరక్షణ అందించేవిధంగా, ప్రపంచస్థాయి మౌలిక వసతుల అభివృద్ధికి ఈ విధానం ఎంతగానో తోడ్పడుతుంది. తెలంగాణ లైఫ్ సైన్సెస్ స్కూల్ నైపుణ్య శిక్షణ(స్కిల్ ట్రైనింగ్) కల్పించడం ద్వారా అవసరమైన మానవ వనరులను సిద్ధం చేయనుంది. అంకుర సంస్థలు, పరిశోధనలకు అవసరమైన పెట్టుబడులకు ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం(పీపీపీ) కింద తొలుత రూ.100 కోట్లతో లైఫ్ సైన్సెస్ ఇన్నోవేషన్ ఫండ్‌ను ఏర్పాటు చేస్తుంది. భవిష్యత్?లో రూ.1,000 కోట్లకు పెంచనుంది. లైఫ్ సైన్సెస్, ఫార్మా, బయోటెక్నాలజీ, వ్యాక్సిన్, వైద్యపరికరాలకు సంబంధించిన రంగాలకు తెలంగాణ రాష్ట్రం ముందంజలో ఉంది.



### అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు :

రీసెర్చ్ అండ్ డెవలప్?మెంట్ యూనిట్లను పారిశ్రామిక సంస్థలుగా వర్గీకరించి, తయారీ యూనిట్లతో సమానంగా ఆర్థిక, ఆర్థికేతర ప్రోత్సాహకాలు అందించనుందనున్నట్లుగా సమాచారం. తద్వారా మరిన్ని అత్యాధునిక పరిశోధనలు, ఆవిష్కరణలు కార్యకలాపాలను ప్రోత్సహించి లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణ స్థానం బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉంది. బయలాజిక్స్, ఫ్రాంటియర్ ఆర్అండ్డీ, ఆధునిక తయారీ, సెల్ అండ్ జీన్ చికిత్స, బయోసెమిలర్స్, ఎంఆర్ఎన్ఏ ప్లాట్‌ఫాం, సీఆర్ఐఎస్ పీఆర్ టెక్నాలజీ, యాంటీబాడీ డ్రగ్ కాంజుగేట్స్, ఒలిగోన్యూక్లియోటైడ్స్, పెప్టైడ్స్, ప్రెసిషన్‌తో పాటు తదుపరి తరం టెక్నాలజీలు, ప్లాట్‌ఫాంలను అభివృద్ధి చేస్తుంది. క్లినికల్ పరిశోధన పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా అది రోగనిర్ధారిత క్లినికల్ రిజిస్ట్రీలు, క్లినికల్ ఇన్నోవేషన్ శాండ్‌బాక్స్‌ను అభివృద్ధి చేస్తుంది.

### జీనోమ్ వ్యాలీ విస్తరణ

గ్రీన్ ఫార్మాసిటీని ఏర్పాటు చేసేందుకు కృషి. వ్యర్థాలను బయటకు పంపించే పరిస్థితి లేకుండా జీరో లిక్విడ్ డిశ్చార్జి (జెడ్ఎల్డీ) అమలయ్యేవిధంగా సుస్థిరమైన, సమగ్ర పారిశ్రామిక క్లస్టర్లు, సెంట్రల్ వేస్ట్ మేనేజ్ మెంట్ సిస్టమ్, ఇంధన వ్యవస్థలతో నెట్‌జీరో పద్ధతి అమలు చేస్తుంది. జీనోమ్‌వ్యాలీని 300 ఎకరాల వరకు విస్తరించేందుకు చర్యలు వైద్యపరికరాలు, డయాగ్నస్టిక్స్‌లో పరిశోధనలు, తయారీకి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పన, ప్లగ్ అండ్ ప్లే సదుపాయాలతో వైద్యపరికరాల సెంటర్?ను విస్తరించనుంది. భద్రతా నియమాలకు లోబడే లైఫ్ సైన్సెస్ సెంటర్లలో 24 గంటల కార్యకలాపాలకు అనుమతిస్తుంది. నిర్దిష్ట సమయంలోగా ప్రతిపాదనలకు ఆమోదం, డీమ్డ్ ఆమోదాలతో అనుమతులకు టీజీ-ఐపాస్ పద్ధతిని ప్రభుత్వం అమలు చేస్తుంది. కేంద్ర అనుమతి సంస్థలతో సంప్రదింపులు చేసేందుకు కూడా ఓ ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయనున్నట్లుగా తెలిసింది. అర్హత కలిగినటువంటి ఆర్థిక ప్రోత్సాహకాలును అందించనున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరక స్టాంపుడ్యూటీ మినహాయింపు, మూలధన పెట్టుబడి రాయితీలు, విద్యుత్తు సబ్సిడీలు, భూమి వ్యయం, రాష్ట్ర వస్తుసేవల పన్నుల తిరిగి చెల్లింపులు, భూమి బదిలీ ఛార్జీల మినహాయింపులను ఈ విధానంలో చేర్చింది.

# మరో మూడు రోజులు తీవ్ర వడగాలులు

**హైదరాబాద్:** రాష్ట్రంలో మరో మూడు రోజులపాటు వడగాలుల తీవ్రత ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ప్రస్తుతం రాష్ట్రంలో సాధారణంక కంటే అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా... దీనికితోడు పడగాలులతో ప్రజలు అక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈనెల 26 వరకు కుమ్రంభీం ఆసిఫాబాద్ మంచి ర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, అయశంకర్ భూపాలపల్లి, ములుగు, నల్లగొండ, సూర్యాపేట, మహబూబా బాద్, వరంగల్, హనుమకొండ, రంగారెడ్డి,హైదరాబాద్ జిల్లాల్లో త్రీవ వడగాలుల ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ చెరిపింది. ఈ మేరకు ఈ జిల్లాలకు ఆరెంజె అలర్ట్ జారీ చేసింది. రాత్రిపూట కూడా కనిష్ట ఉష్ణోగ్రతలు దాదాపు 30 డిగ్రీల మేర ఉంటాయని వివరించింది. శని వారం రాష్ట్రంలో అత్యవరంగా ధర్మపురి మండలం బుద్ధిశిపల్లిలో 48.3 డిగ్రీల సెల్సియస్ ఇష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రం. లోని ప్రధాన నగరాల్లో ఉష్ణోగ్రతలు చురుకుగా నైరుతి రుతుపవనాలు నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులు శీలిస్తే గరిష్ఠ ఉష్ణోగ్రత అమ్మంలో 44.8 డిగ్రీలుగా నమోదైంది. మరో రెండ్రోజుల్లో నైరుతి రుతుపవనాలు ఆగ్నేయ అరేబియా సముద్రంలోని దాదాపు అన్ని ప్రాంతాలు, కొమరిన్ ప్రాంతం, నైరుతి, ఆగ్నేయ బంగాళాఖాతం, అండమాన్ సముద్రంలోని మిగిలిన భాగాలు, తూర్పు-మధ్య బంగాళాఖాతంలోని మరిన్ని ప్రాంతాలలోకి విస్తరించమన్నాయి. ఈనెల 26న కేరళలోకి ప్రవేశించేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నట్లు వాతా వరణ శాఖ తెలిపింది. నైరుతి బిహార్, దాని పరిసరాల్లో ఏర్పడిన ఉపరితల చక్ర వాహత ఆవర్తనం శనివారం జార్ఖండ్ ఉత్తర రత్తీస్ గఢ్, ఒడిశాల మీదుగా ఉత్తర కోస్తా ఆంధ్ర తీరం వరకు కొనసాగుతోంది. ఇది సముద్ర మట్టం నుంచి సగటున 0.8 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతోంది. అది, సోమవారాల్లో రాష్ట్రంలోని తూర్పు ఉత్తర జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలిక పాటి నుంచి మోస్తరు వర్గాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వివరించింది.




## అకాల వర్షాలతో రైతులు ఆందోళన చెందవద్దు

**హైదరాబాద్ :** ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను పౌర సరఫరాలు, భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వరి ధాన్యం కొనుగోళ్లపై ఆదివారం హైదరాబాద్‌లో సహచర మంత్రులు, ఉన్నతాధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ధాన్యం సేకరణ వేగవంతం చేయాలని అధికారులకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. రైతులకు చెల్లింపుల పురోగతిపై ప్రత్యేకంగా చర్చించారు. తాలు, తరుగు పేరుతో కోతలు వేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతుకు నష్టం చేసే చర్యలను రాష్ట్ర ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించదన్నారు. కాంటా కోసం వేచి ఉన్న 8.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని అధికారులను ఈ సందర్భంగా ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని త్వరితగతిన మిల్లులకు తరలించాలని స్పష్టం చేశారు. అకాల వర్షాలతో ఆందోళన చెందవద్దని.. తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులకు మంత్రి ఉత్తమ్ హామీ ఇచ్చారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయకుంటే.. మిల్లర్లు, కొనుగోలు సిబ్బందిపై కఠిన చర్యల తప్పవని హెచ్చరించారు.

రైతుల్లో గందరగోళం సృష్టించవద్దంటూ అధికారులను మంత్రి ఉత్తమ్ ఆదేశించారు. ఖరీఫ్, రబీ కలిపి రైతులకు రూ.45 వేల కోట్లు చెల్లింపులు చేశామన్నారు. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 8,575 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇప్పటి వరకు 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని గణాంకాలతో సహా ఆయన వివరించారు. ఈసారి మొత్తం 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం నిర్దేశించుకుందని చెప్పారు. కొనుగోలు చేసిన ధాన్యానికి రూ.8,749 కోట్ల నగదు రైతుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు. రాష్ట్రంలో 21 కోట్ల గన్నీ బ్యాగులు సిద్ధంగా ఉన్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గన్నీ బ్యాగుల కొరత అంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని కొట్టి పారేశారు. హమాలీల కొరతతో కొంత జాప్యం జరిగిందన్నారు. రబీ సీజన్‌లో రికార్డు స్థాయిలో 141 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి జరిగిందని వివరించారు. కేంద్రం కేవలం 52 లక్షల మెట్రిక్ టన్నులే కొనుగోలు చేస్తోందని స్పష్టం చేశారు. మిగిలిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు. అలాగే కొనుగోలు కేంద్రాల పనితీరుపై జిల్లా వారీగా సమీక్షించారు. ధాన్యం రవాణా, గోదాముల నిల్వ సామర్థ్యంపై కూడా ఆయన సమీక్షించారు. మహిళా సంక్షేమ కార్యక్రమాల కార్యాచరణపై కూడా ఈ సందర్భంగా చర్చించారు. ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక అమలుపై సమన్వయంతో కలిసి పని చేయాలని అధికారులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

## వారికి మాత్రమే టికెట్లు ఇస్తాం



తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. జూన్ 2 ఆవిర్భావ దినోత్సవ వేళ.. రేవంత్ ప్రభుత్వం కొత్త పథకాలు.. నిర్ణయాలు అమలు చేసేందుకు సిద్ధమైంది. రేవంత్ ప్రభుత్వం లక్ష్యంగా బీఆర్ఎస్ రాజకీయంగా కొత్త వ్యూహాలు అమలు చేస్తోంది. త్వరలో గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలు జరిగే అవకాశం ఉండటంతో.. అటు బీజేపీ సైతం రాజకీయంగా కీలక అడుగులు వేస్తోంది. ఇదే సమయంలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తి కరంగా మారాయి.

వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా తెలంగాణలో మూడు ప్రధాన రాజకీయ పార్టీలు కొత్త వ్యూహాలు సిద్ధం చేస్తున్నాయి. ప్రభుత్వం పైన వ్యతిరేకత ఎక్కువగా ఉందని.. తిరిగి తామే అధికారంలోకి వస్తామని బీఆర్ఎస్ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే, 2034 ఎన్నికల వరకు తానే సీఎం గా ఉంటానని రేవంత్ పదే పదే చెబుతున్నారు. అటు బీజేపీ నేతలు సైతం ప్రజలు తమతో నే ఉన్నారని చెబుతున్నారు. ఈ సమయంలోనే కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేసారు. నాయకుల చుట్టూ తిరిగే వాళ్లకు కాదు.. ప్రజల చుట్టూ తిరిగే నాయకులకు టికెట్లు ఇస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. అంబర్‌పేట్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ ఎవరికీ కూడా పలానా వారికి టిక్కెట్లు ఇస్తామని వాగ్దానాలు చేయలేమని... ఎవరు ఎక్కువ ఉరుకుతరో.. ఎవరెక్కువ తండ్లాడుతరో.. ఎవరు ప్రజా సమస్యల విషయంలో ఎక్కువ పోరాటం చేస్తరో.. ఎవరో కార్యక్షేత్రంలో గట్టిగా మెంబర్ షిప్ చేస్తరో.. ఎవరైతే గట్టిగా ప్రజల కోసం నిలబడ తారో వారికే సీట్లు ఇస్తామని తేల్చి చెప్పారు.

### వారికి మాత్రమే టికెట్లు ఇస్తాం

2023 ఎన్నికల్లో సీట్ల విషయంలో చోటు చేసుకున్న పొరపాట్లతో ఈ సారి బీఆర్ఎస్ ముందస్తుగా నే అప్రమత్తం అవుతోంది. ఎవరికీ సీట్ల విషయంలో ముందస్తు హామీలు... సిట్టింగ్ ల విషయం లోనూ క్షేత్ర స్థాయి పరిస్థితులకు అనుగుణంగా వ్యవహరించాలని డిసైడ్ అయింది. అందులో భాగంగానే.. ఎవరుపార్టీ కోసం నిలబడ్డరో.. కేవలం ఎమ్మెల్యే గారి చుట్టూ పెద్ద నాయకుల చుట్టూ తిరిగే వాళ్లకు కాదు.. ప్రజల చుట్టూ తిరిగే నాయకులకు సర్వేల ఆధారంగానే టికెట్లు ఇస్తామని కేటీఆర్ తేల్చి చెప్పారు. పార్టీ పరంగా, ప్రజల పరంగా ఎవరికి పరపతి ఉన్నది. ప్రజలకు ఎవరి మంచి పేరున్నది. ఇవన్నీ చూసుకొని వారికే టిక్కెట్లు ఇవ్వడం జరుగుతుందని కేటీఆర్ స్పష్టం చేశారు. దీంతో.. సీట్ల విషయంలో ముందస్తుగానే ఎవరూ ఆశలు పెట్టుకోవద్దని.. పూర్తి స్థాయి సమాచారంతో సర్వేల ద్వారా ఎవరు గెలుస్తారో వారికే సీటు ఉంటుందని కేటీఆర్ తేల్చి చెప్పారు.

## మక్కల కొనుగోళ్లకు మాది 'గ్యారంటీ'!

-మొదటిపేజీ తరువాయి

ఉండగా, మార్కెట్‌లో రూ.1,700 నుంచి రూ.1,850 గిట్టుబాటు ధర పలుకుతోంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వమే కనీస మద్దతు ధర కింద రైతుల నుంచి కొనుగోలు చేస్తోంది. ఇప్పటి వరకు 354 కొనుగోలు కేంద్రాల (పీఏసీఎస్‌లు) ద్వారా 2.33 లక్షల రైతుల నుంచి 12.85 లక్షల మెట్రిక్ టన్నుల మక్కలను మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసింది. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన మక్కల విలువ రూ. 3,100 కోట్ల వరకు ఉంటుంది. అయితే మార్కెట్‌కు భారీ ఎత్తున మక్కలు వస్తుండడంతో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మార్క్‌ఫెడ్‌కు అదనపు రుణం పొందేందుకు అవసరమైన బ్యాంకు గ్యారంటీని ప్రభుత్వం సమకూర్చింది.

### కేంద్రం సహకరించకపోయినా రైతులకు అండగా : మంత్రి తుమ్మల

రాష్ట్రంలోని రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని మొక్కజొన్న, జొన్న, పొద్దు తిరుగుడు పంటల కొనుగోళ్లపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకున్నారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి కొనుగోళ్లపై ఆశించిన స్థాయిలో స్పందన రాకపోవడంతో రైతులు నష్టపోకుండా రాష్ట్ర ప్రభుత్వమే ముందుకొచ్చి భారీ స్థాయిలో కొనుగోళ్లు చేపట్టేందుకు సీఎం ఆమోదం తెలిపారన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో మొక్కజొన్న కొనుగోళ్లకు మొత్తం రూ.5,063 కోట్ల మేర మాత్రమే ఖర్చు చేయగా, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఈ ఒక్క యాసంగి సీజన్‌లోనే దాదాపు రూ.6,000 కోట్ల మేర వ్యయం చేస్తోందని తుమ్మల స్పష్టం చేశారు.

### జొన్నల కొనుగోళ్లకు రూ.1,100 కోట్లు

జొన్న (హైబ్రిడ్) కొనుగోళ్ల విషయంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని మంత్రి తుమ్మల తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో జొన్న ధర క్వింటాల్‌కు సుమారు రూ.2,000 మాత్రమే ఉండగా, కేంద్రం నిర్ణయించిన కనీస మద్దతు ధర రూ.3,699గా ఉందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు రూ.1,100 కోట్లకు పైగా వ్యయంతో జొన్న కొనుగోళ్లు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు.

# జగిత్యాలలో ఎండల తీవ్రత తారాస్థాయికి

**46 డిగ్రీల ఉష్ణోగ్రతతో ప్రజల అవస్థలు**

**నిర్మానుష్యంగా రోడ్లు**

**బయటకు రావాలి అంటే జంకుతున్న ప్రజలు**

**జగిత్యాల,మే24, అక్షర రేఖ. మానేరు సురేష్** జగిత్యాల జిల్లా, పట్టణ పరిసర ప్రాంతాల్లో ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. గత కొన్ని రోజులుగా ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల సెల్సియస్‌ను తాకడంతో ప్రజలు ఇంటి బయటకు రావడానికి భయపడుతున్నారు. మధ్యాహ్న సమయంలో రహదారులు నిర్మానుష్యంగా మారిపోతుండగా, అత్యవసర పనుల కోసం బయటకు వచ్చే వారు గొడుగులు, తలపాగాలు దరిస్తూ బయటకు వచ్చే అప్పుడు రక్షణ పరికరాలు ఉపయోగిస్తూ ఎండ నుండి రక్షణ పొందేందుకు ప్రయత్నిస్తున్నారు. పట్టణంలోని ప్రధాన రహదారులు, బస్ స్టాండ్లు, మార్కెట్ ప్రాంతాల్లో ఎండ వేడి ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. వృద్ధులు, చిన్నపిల్లలు, రోజువారీ కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా బహిరంగ ప్రదేశాల్లో పని చేసే కార్మికులు చెమటలు కారుస్తూ పని చేయాల్సి వస్తోంది. పలువురు ప్రజలు తలనొప్పి, అలసట, డీహైడ్రేషన్ వంటి సమస్యలతో ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. వైద్య నిపుణులు ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.ఉదయం 8 గంటల నుండే సూర్యుని ప్రతాపం చూపించడం మూలంగా ప్రజలు బయటకు రాకుండా వుంటున్నారు ముఖ్యంగా మధ్యాహ్నం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ప్రజలు అవసరం లేకపోతే బయటకు వెళ్లొద్దని అధికారులు తెలుపుతున్నారు బయటకు వెళ్లాల్సి వచ్చినప్పుడు తప్పనిసరిగా గొడుగు, టోపీ లేదా తలపై గుడ్డలను వాడాలని సూచించారు. ఎక్కువగా నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. ఎండల నుండి రక్షణ కోసం సూచనలు: వైద్యులు సూచిస్తూ లి మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లడం తగ్గించాలి లి ఎక్కువగా నీరు తాగాలి,మట్టి కుండ నీటినే త్రాగాలి ఫ్రిజ్ నీటిని తక్కువగా త్రాగాలి,ఎక్కువ శాతం మజ్జిగ,పండ్ల రసాలు,కొబ్బరి నీరు, నిమ్మరసం, రాగి జావా, పలుదా వంటి రసాలు సేవించాలి లి మద్యం, మాంసాన్ని, మసాలా దినుసులు తక్కువ వాడుతుండాలి లి తేలికపాటి పత్తి బట్టలు ధరించాలి,నల్లటి వస్త్రాలు దరించకపోడం ఉత్తమం లి



గొడుగులు, టోపీలు ఉపయోగించాలి పిల్లలు, వృద్ధులు ఎండలో ఎక్కువసేపు ఉండకుండా జాగ్రత్త పడాలి శరీరంలో నీరసం అనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి ఇదిలా ఉండగా, వాతావరణ శాఖ రానున్న రోజుల్లో కూడా ఉష్ణోగ్రతలు అధికంగానే ఉండే అవకాశం ఉందని తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## ఫోన్ కాల్ కు స్పందించిన మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ గారు చూస్తే అనాధ శవం...



**జమ్మికుంట మే 24 అక్షర రేఖ** ఫోన్ కాల్ కు స్పందించిన మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ గారు మాట్లాడుతూ ఈరోజు జమ్మికుంట పట్టణ మున్సిపల్ పరిధిలో జరిగిన ఒక విషాదకర సంఘటన మనసును కలచివేసింది ఉదయం ఒక ఫోన్ కాల్ ద్వారా జమ్మికుంట బస్టాండ్ సమీపంలోని ఫ్లైఓవర్ దగ్గర ఒక వృద్ధుడు మరణించినట్లు సమాచారం అందింది వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని స్థానిక పోలీస్ సీఐ గారికి సమాచారం అందించగా, వారు కూడా సిబ్బందిని పంపించి సహకరించారు విచారణలో ఆ వృద్ధుడు దేవాలయాల వద్ద భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగించే వ్యక్తిగా గుర్తించడం జరిగింది తదుపరి మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది మరియు పోలీస్ జవాన్ల సహాయంతో ఆ వృద్ధుడిని ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించి పంచనామా నిర్వహించాం అనంతరం మున్సిపల్ ఆధ్వర్యంలో ఆయన అంత్యక్రియలు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో నేను స్వయంగా పాల్గొనడం జరిగింది ఈ సంఘటన చాలా బాధ కలిగించింది.ఎండల తీవ్రతను తట్టుకోలేకపోవడం వల్లే ఆ వృద్ధుడు ప్రాణాలు కోల్పోయినట్లు భావిస్తున్నాం. అందుకే జమ్మికుంట పట్టణ ప్రజలందరికీ ఒక విజ్ఞప్తి --- ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో అవసరం అయితే తప్ప వృద్ధులను, అనారోగ్యంతో ఉన్నవారిని, చిన్నపిల్లలను బయటకు పంపకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.అలాగే రోడ్డుపై ఎండలో ఇబ్బంది పడుతున్న వృద్ధులు,వికలాంగులు, భిక్షాటన చేసుకునే వారు ఎవరైనా కనిపిస్తే వారికి కొంత మంచినీళ్లు ఇవ్వడం, నీడలో కూర్చోబెట్టడం వంటి మానవతా కార్యక్రమాలు చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.ఇటువంటి సేవా భావంతో ముందుకు వస్తే సమాజంలో మంచి అవగాహన పెరుగుతుంది ఈరోజు జరిగిన ఈ సంఘటన నన్ను వ్యక్తిగతంగా ఎంతో కలచివేసింది మరణించిన ఆ వృద్ధుడి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ... శలవు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శ్రీపతి నరేష్,బోళ్ళ సదానందం, మున్సిపల్ జవాన్లు మరియు సిబ్బంది పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైరా ఏసీపి సారంగపాణిని మర్యాదపూర్వకంగా కలిసిన..

**ఖమ్మం జిల్లా కాంగ్రెస్ హెల్త్ అండ్ మెడికల్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ**




**ఖమ్మం జిల్లా బ్యూరో అక్షర రేఖ మే 24 వైరా** వైరా ఏసిపి సారంగపాణి ని మర్యాదపూర్వకంగా కలిసిన ఖమ్మం జిల్లా కాంగ్రెస్ హెల్త్ అండ్ మెడికల్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ లయన్ ఐ కేర్ హాస్పిటల్ నిర్వాహకులు ఉంద్రు శ్యాంబాబు ,తోటకూర శ్రీకాంత్ , ఉయ్యూరి రామకృష్ణ ,ఈ సందర్భంగా డాక్టర్ కాపా మురళీకృష్ణా, ఉంద్రు శ్యాంబాబు వైరా ఎస్సై పుష్పాల రామారావు తో కలిసి ఎసిపి సారంగపాణి కి శాలువా కప్పి సన్మానించారు.

## మైనారిటీ జిల్లా అధ్యక్షుల నియామక ప్రక్రియ ప్రారంభం

**జిల్లా ముస్లిం మైనారిటీ నాయకులు దరఖాస్తు చేసుకోవాలని పిలుపు**

**జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ లి**

**ఖమ్మం జిల్లా అబ్జర్వర్ లిసయ్యద్ హుజ్మతుల్లా ఖాద్రి**



**ఖమ్మం జిల్లా బ్యూరో అక్షర రేఖ న్యూస్ మే 24** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సంబంధించిన మైనారిటీ సెల్ జిల్లా చైర్మన్ కమిటీలను రద్దు చేసి కొత్త కమిటీల నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని ఉమ్మడి ఖమ్మం జిల్లాకు అబ్జర్వర్ గా సయ్యద్ హుజ్మతుల్లా ఖాద్రి ని నియమించిన రాష్ట్ర మైనారిటీ సెల్ చైర్మన్ మహ్మద్ ఇర్ఫాన్ అలీ ఆదేశాల మేరకు జిల్లా మైనారిటీ అధ్యక్షుల ఎంపిక ప్రక్రియ ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లా మైనారిటీ సెల్ చైర్మన్ కొరకు ముస్లిం మైనారిటీ నాయకులు రేపు 25-5-2026 సోమవారం ఉదయం 10.00 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షులు మరియు అబ్జర్వర్ సయ్యద్ హుజ్మతుల్లా ఖాద్రి సమక్షంలో దరఖాస్తులు స్వీకరించబడును ఖమ్మం జిల్లా నలుమూలల నుంచి వచ్చి దరఖాస్తు చేసుకోవాలని, నూతి సత్యనారాయణ గౌడ్ తెలిపారు.

## శ్రీ సూర్య దనవతరి దేవాలయం లో ప్రత్యేక పల్లకీ సేవ



**జగిత్యాల, మే24, అక్షర రేఖ న్యూస్ మానేరు సురేష్**జగిత్యాల పట్టణము చింతకుంట చెరువు సమీపంలోని శ్రీ సూర్య నగర్ లో కొలువై ఉన్న శ్రీ సూర్య దేవాలయం లో 2026 మే 24 ఆదివారం భానువాసరే అధిక జ్యేష్ఠ మాసం శుక్ల పక్షం అష్టమి పర్వదినం సందర్భంగా శ్రీ సూర్య ధన్వంతరిఉషా చాయ సమేత శ్రీ సూర్య నారాయణ స్వామి వారికి భక్తులచే పంచామృత అభిషేకం ను ఘనంగా నిర్వహించారు అధిక జేష్ఠ మాసం అలాగే మే25 నుండి రోహిణి కార్తె ప్రారంభ సందర్భంగా అష్టమి పర్వదినం పురస్కరించుకొని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయములో శ్రీ సూర్య భగ వానుకి, ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం భక్తులచే ప్రత్యేక పల్లకి సేవ నిర్వహించారు. తదుపరి విచ్చేసినటు వంటి భక్తులకు ఉచిత అమృత నిర్గుండి కశాయం వితరణ చేశారుఈ కార్యక్రమంలో భాగంగా కోరిన కోరికలను తీర్చే భగవానుడు శ్రీ సూర్య భగవాన్ కు భక్తులు ముడుపులు కట్టారు. సూర్య భగవానుని విశిష్టతను ఆలయ అర్చకులు నరేష్ వివరిస్తూ ఆదివారం సూర్య భగవానుని ప్రత్యేక దినం ఆదివారం హిందూ సాంప్రదాయంలో సూర్య భగవానుని (సూర్యుని)కి అంకితమైన పవిత్రమైన రోజు ఈ రోజు సూర్యదేవుని ఆరాధించడం వల్ల ఆరోగ్యము, ఆయుష్మానుభవం, విజయం, ధనం, మరియు ప్రసిద్ధి లభిస్తాయని విశ్వాసం అలాగే ప్రతి ఆదివారం రోజున మధు మద్యం నాన్ వెజ్ తినకుండా ఉంటే మంచిది అని తెలిపారు.ఈకార్యక్రమములో ఫౌండర్ ,చైర్మెన్ డాక్టర్ వడ్ల గట్ట రాజన్న,వర్కింగ్ ప్రెసిడెంట్ వొడ్నాల శ్రీనివాస్ సహాయ కోశాధికారి వడ్ల గట్ట గోపి - స్వాతి ,కార్యదర్శి వడ్లగట్ట శంకర్,సహాయ కార్యదర్శి భారతాల రాజసాగర్,మండలలోజు రవీందర్, వాసం శ్రీనివాస్ ప్రవీణ్ కుమార్ ,కావ్యశ్రీ,అర్చకులు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ ను తొలగించాలి.

**ప్రజల ఆరోగ్యాన్ని భ్రష్టు పట్టిస్తున్నాడు. పలు రెస్టారెంట్లనుండి నెలవారి**

**మామూళ్లు,లంచాలు తీసుకుంటూ తన ఆరోగ్యం బాగాలేదని చెప్పి విధులు నిర్వహణ.**

**జిల్లా కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలి. షేక్ బాజీ బాబా (జిల్లా అధ్యక్షుడు)**

**ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ ఖమ్మం జిల్లా.**



**ఖమ్మం జిల్లా బ్యూరో అక్షర రేఖ న్యూస్ మే 24** ఖమ్మం జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ నిర్వాకం వల్ల ఖమ్మం జిల్లా ప్రజల ఆరోగ్యం అస్తవ్యస్తంగా మారి అనారోగ్యం బారిన పడుతున్నారని, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ బాజీ బాబా విమర్శించారు. అభివృద్ధి చెందుతున్న ఖమ్మం పట్టణంలో వివిధ వ్యాపార వాణిజ్య సముదాయాలు ఏర్పడుతున్నాయని, ప్రధానంగా ఆహార పదార్థాల రుచులపై ప్రజలు ఎక్కువ మక్కువ చూపిస్తున్నారని, కానీ ఆహార పదార్థాల విషయంలో అన్ని కల్తీ జరుగుతున్న కూడా ఫుడ్ సేఫ్టీ అధికారులు తీవ్ర జాప్యం చేస్తూ లంచాలు దండుకుంటున్నారని,, ఆయన విమర్శించారు. ప్రధానంగా రెస్టారెంట్ లలో, హోటళ్లలో, అదేవిధంగా బిర్యానీ పాయింట్లు, ఆహార ప్రియుల సముదాయాలు మండిలలో, న్యూడిల్స్, పాయింట్లలలో, బహిరంగంగా ఆహార ప్రేమికులకు ఇష్టరాజ్యంగా వండించే పలు దుకాణాలలో కల్తీకారం, కల్తీ నూనె, కల్తీ పసుపు, కల్తీ అల్లం, కల్తీ స్పైసీలు, రంగురంగుల ద్రావణాలు, ఇష్టారాజ్యంగా వాడుతూ, ప్రజా ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్న కూడా ఫుడ్ సేఫ్టీ అధికారులు గాలికి వదిలేస్తున్నారని, వాటిపై తగు చర్యలు తీసుకోవడంలో వెనకడుగు వేస్తున్నారని, ప్రధానంగా ఫుడ్ సేఫ్టీ అధికారి తాను అనారోగ్యంగా ఉన్నానని, పలువురికి చెబుతూ జిల్లా ప్రజల ఆరోగ్యాన్ని గాలికి వదిలేస్తున్నాడని ఆయన విమర్శించారు. ఖమ్మం పట్టణ శివారులలో ఇష్టారాజ్యంగా "దాబా"లు ఏర్పాటు చేసుకున్నారని, మందు విక్రయాలు జరుగుతున్నాయని, పలు వివాదాలు, ఘర్షణలు గొడవలు, జరుగుతున్నాయని, వాటిపై ఎక్కడా కూడా చర్యలు తీసుకున్న పాపాన పోలేదని ఆయన అన్నారు. జిల్లాలో అదేవిధంగా ఖమ్మం పట్టణంలో చర్యలు తీసుకొని కేసులు నమోదు చేసి, హోటళ్లను అదేవిధంగా వివిధ అనధికారిక విక్రయాలు చేస్తూ ప్రజా ప్రాణాలతో చలగాటమాడుతున్న దుకాణాలపై చర్యలు తీసుకున్న దాఖరాలు, నోటీసులు ఇచ్చిన సందర్భాలు లేవని ఆయన విమర్శించారు. మాంస ఆహార పదార్థాలను రెండు మూడు రోజులకు పైగా ఫ్రిజ్ లలో నిల్వ ఉంచి వాటిని ఆహార ప్రియులకు మళ్లీ అందిస్తున్న హోటల్ మరియు రెస్టారెంట్ ల పై కూడా చర్యలు తీసుకోవడం లేదు. హోటల్ నుండి రెస్టారెంట్ నుండి అదేవిధంగా వివిధ బాహ్య ప్రదేశాలలో నడుస్తున్న, వివిధ సముదాయాల నుండి తన అసిస్టెంట్ ద్వారా, తన అనుచరుల ద్వారా లంచాలను పొందుతూ ఖమ్మం జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్, అనారోగ్యం పేరు చెప్పి, తన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, ప్రజా ఆరోగ్యాన్ని గాలికి వదిలేసారని, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ ( ×ఖమీా) పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ బాజీ బాబా విమర్శించారు. ఇప్పటికే ఖమ్మం పట్టణంలో కల్తీ నూనె, కల్తీ కారం, కల్తీ పసుపు, కల్తీ అల్లం, రంగులను అద్దినటువంటి వివిధ రకాల ఆహారాలను ప్రజలకు అందిస్తూ వారి ఆరోగ్యాలను, భ్రష్టు పట్టిస్తూ వివిధ వ్యాపారాలను నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోకుండా, లంచాలకు అలవాటు పడి, తన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ పై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ ×ఖమీా పార్టీ ఆధ్వర్యంలో "ధర్నా" నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

## నేటి నుండి రోహిణి కార్తె ప్రారంభం

**రోహిణి కార్తె అంటే ఏంటీ ?**

**ఎండలు ఎందుకు ఎక్కువగా ఉంటాయి ?**





**జగిత్యాల, మే24 అక్షర రేఖ న్యూస్ మానేరు సురేష్** ప్రతి సంవత్సరం రోహిణి కార్తె వచ్చింది అంటే వామ్మో రోహిణి కార్తెలో ఎండలకు రోకళ్ళు పగిలే ఎండలు ఉంటాయి అనే నానుడి మనలో మెదలాడుతూ ఉంటుంది. నిజమే మరి ఈ నాలుగు నెలల ఎండాకాలంలో ఎండలు తొలి రోజులలో కొద్ది కొద్దిగా ఉండి ఉగాది నుండి తాపం పెరుగుతుంది. దిన దిన ప్రవర్ధమానంగా సూర్య భగవానుడు తన ప్రతాపాన్ని మనకు చూపిస్తాడు. మాములుగా ఉండే ఎండల వేడినే తట్టుకోలేమంటే ఎండాకాలంలో చివరి కార్తె అయిన రోహిణిలో ఎండలు దద్దరిల్లుతాయి. మరి ఈ సంవత్సరం రోహిణి కార్తె ఏలా ఉంటుందో గమనిద్దాం. ఈ సంవత్సరం రోహిణి కార్తె 2026 మే 25 న ప్రారంభమై2026 జూన్ 8 వరకు రోహిణి కార్తె ఉంటుంది.రోహిణి కార్తె ఫలితంగా ఈ పక్షం రోజులు అధిక వేడి గాలులు , ఎండ తీవ్రతలు , అగ్ని ప్రమాదాలు , ఉక్కపోతలు ఉంటాయి.ఎండ తీవ్రతకు శరీరం అలసిపోతుంది. కావునా ఆరోగ్య రీత్య తగు శ్రద్దలు తీసుకోవాలి. ఎక్కువ మట్టికుండ నీళ్ళు త్రాగడం , మజ్జిగా , పండ్ల రసాలు , కొబ్బరినీళ్ళు , నిమ్మరసం , రాగి జావ , ఫలుదా లాంటివి ఎక్కువగా త్రాగడం వలన ఆరోగ్యానికి అనుకూలంగా ఉంటుంది కొంత ఉపశమనం లభిస్తుంది. మసాలాకు సంబంధించిన ఆహార పదార్ధాలు , వేపుళ్ళు , పచ్చళ్ళు , ఎక్కువ ఆయిల్ ఫుడ్ కలిగిన ఆహార పదార్ధాలు తినకూడదు. నీళ్ళ సౌకర్యం ఉన్నవారు తప్పకుండా రెండు పూటల స్నానం చేయండి. అన్నిరకాల వయస్సు వారు ఎక్కువ కాటన్ దుస్తులు వాడండి , తెల్లని రంగు కల్గినవి , తేలిక రంగులు గల కాటన్ బట్టలు ధరిస్తే ఉష్ణ తాపం నుండి ఉపశమనం లభిస్తుంది. శారీరక తాపం తగ్గుతుంది. చిన్నపిల్లలకు మీరు ఉండే ఇంటి ఉష్ణోగ్రత తీవ్రతను బట్టి తడి గుడ్డతో తుడిచి బట్టలు మార్చండి. ఎవరైనా సరే ముదురు రంగు దుస్తులు వేయకపోవడం ఉత్తమం. ముఖ్యంగా సాటి జీవులైన పశు , పక్ష్యాదులకు త్రాగడానికి మీరు నివసించే చోట వాటికి నీళ్ళను ఏర్పాటు చేయండి. బాటసారులు ఎవరైనా సరే వాళ్ళు అడగక పోయిన వాళ్ళ దాహాన్ని తీర్చెందుకు వారికి త్రాగడానికి చల్లటి నీళ్ళను అందివ్వండి. ఇలాంటి సంఘ సేవా కార్యక్రమాలు చేయడం వలన మీకున్న గ్రహభాదలు నివారణకు మార్గమై కొంత ఉపశమనం లభిస్తుంది. అంతే కాకుండా మీకు మీ కుటుంబ సభ్యులకు ఎంతో పుణ్యఫలం దక్కి అంతా మంచి జరుగుతుంది. రోహిణి కార్తె ఎప్పటి నుంచి ప్రారంభం? రోళ్లు పగిలే ఎండలకు కారణం ఇదే! తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రతను సూచించే 'రోహిణి కార్తె' 2026 ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. జ్యోతిష్యశాస్త్రం ప్రకారం, గ్రహాల రాజుగా పరిగణించే సూర్య భగవానుడు మే 25వ తేదీ సోమవారం నాడు రోహిణి నక్షత్రంలోకి ప్రవేశించనున్నాడు. జూన్ 8వ తేదీ వరకు సూర్యుడు ఇదే నక్షత్రంలో సంచరించడం వల్ల ఈ పక్షం రోజుల పాటు ఎండలు మునుపెన్నడూ లేని విధంగా భగభగమండనున్నాయి. 'రోహిణి కార్తె వస్తే రోళ్లు పగులుతాయా?' వేసవి కాలంలో వచ్చే ఎండలు ఒక ఎత్తు అయితే, రోహిణి కార్తెలో నమోదయ్యే ఉష్ణోగ్రతలు మరో ఎత్తు. ఈ సమయంలో సూర్యుడి కిరణాలు నేరుగా భూమిపై పడటం వల్ల ప్రతాపం తీవ్ర స్థాయిలో ఉంటుంది. అందుకే మండే ఎండల తీవ్రతను తెలపడానికి పెద్దలు "రోహిణి కార్తెలో రోళ్లు పగులుతాయి" అనే సామెతను వాడుకలోకి తెచ్చారు. ఎన్నడూ లేని విధంగా ఈ వేసవిలో46 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఉండటంతో ప్రజలు రోడ్ల పైకి రావాలి అంటే భయపడుతున్నారు దానికి తోడు నేటినుంచి రోహిణి కార్తె ప్రారంభం అవుతుండటం తో ఈ పక్షం రోజులు ఇంకా ఎండలు కొట్టే అవకాశం ఉంది కాబట్టి అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు తగిన జాగ్రత్తలతో రావాలిసిందిగా అధికారులు ప్రజలకు తెలుపుతున్నారు ప్రతి సంవత్సరం ఎండలు అధికం కావడానికి కారణం చూస్తుంటే చెట్లను నరకడం చెట్లను పెంచకపోవడం చెరువులను కబ్జా చేసి ఇంటి నిర్మాణము లు చేయడం కూడా ఒక కారణము అయినది అలాగే ప్లాస్టిక్ ను అధికంగా వాడటం మూలంగా అవి భూమిలోకి వెళ్లి కరగకుండా ఉండి అధిక ఉష్ణోగ్రతలు పెరగటానికి కారణం అవుతోంది ఇకనైనా చెట్లను పెంచి ప్లాస్టిక్ ను తగ్గించి చేతి బట్ట సంచులు ఉపయోగిస్తే పర్యావరణాన్ని కాపాడిన వారం అవుతాము.వ్యవసాయ పంచాంగం - ఏరువాక ప్రారంభం సూర్యుడు ఏ నక్షత్రానికి దగ్గరగా ఉంటే ఆ కాలానికి ఆ నక్షత్రం పేరుతో కార్తెగా పిలుస్తారు. ఏడాదికి మొత్తం 27 కార్తెలు ఉంటాయి. రోహిణి కార్తె ముగియగానే జూన్ 9 నుండి మృగశిర కార్తె ప్రారంభమవుతుంది.ఈ సమయంలోనే తొలకరి జల్లులు కురుస్తాయి.దీనిని బేస్ చేసుకుని రైతులు తమ పొలాల్లో 'ఏరువాక' పనులను ముమ్మరం చేస్తారు. రోహిణి కార్తెలో చేయకూడని పనులు ఇవే ఈ పక్షం రోజుల పాటు సూర్యుడి తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల పెద్దలు కొన్ని నియమాలను సూచించారు శుభకార్య...

## పరిశుద్ధాత్మ దిగివచ్చిన దినమే పెంతెకొస్తు పండుగ

**? పెంతెకొస్తు పండుగ దినమున ధర్మశాస్త్రం ఆమోదించబడింది**


**? అసెంబ్లీ ఆఫ్ యావె మినిస్ట్రీ పాస్టర్ పాలడుగు రత్నపాల్**



**ఖమ్మం, జిల్లా బ్యూరో అక్షర రేఖ న్యూస్ మే 24 :** పరిశుద్ధాత్మదిగివచ్చిన దినమే పెంతెకొస్తు పండుగ అని, పెంతెకొస్తు పండుగ దినమున ధర్మశాస్త్రం ఆమోదించబడిందని ఈ పండుగను పరిశుద్ధ గ్రంధం బైబిల్ నందు ప్రవక్తలు, యాషువ మెస్సీయ, అపోస్తులలు పాటించారని, విశ్వాసమున్న ప్రతిఒక్కరూ ఈ పండుగను ఆచరించాలని, ఇది 'ఆజ్ఞ' అని అసెంబ్లీ ఆఫ్ యావె మినిస్ట్రీ పాస్టర్ పాలడుగు రత్నపాల్ అన్నారు. ఖమ్మం నగరంలోని రమణగుట్ట యావె సమాజ ప్రార్థన మందిరంలో ఆదివారం పెంతెకొస్తు పండుగ(వారముల పండుగ)ను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాస్టర్ పాలడుగు రత్నపాల్ బైబిల్ గ్రంధాన్ని బోధిస్తూ.. పరిశుద్ధ గ్రంథమైన బైబిల్ ను ప్రామాణికంగా తీసుకొని విశ్రాంతిదినమును(సబ్బాత్), నెలపొడుపు దినము, పండుగలు ఎలోహిం (దేవుని) కట్టడులని, బైబిల్ ను నమ్మి విశ్వసించేవారందరూ తప్పకుండా ఆచరించాలని బోధించారు. బైబిల్ పండుగలలో పెంతెకొస్తు (ప్రథమ ఫలాల) పండుగ ప్రత్యేకమైనదన్నారు. ఈ పండుగ దినమున పరిశుద్ధాత్మ దిగివచ్చినదని, అలాగే ధర్మశాస్త్రము ఆమోదించబడిందని లేఖనాలు తెలియజేస్తున్నాయన్నారు. లేఖనాలైన లేవియాకాండం 23 : 11, 16, ద్వితియోపదేశకాండము 16 : 16, అపోస్తుల కార్యములు 2 : 1 లలో స్పష్టం చేస్తున్నాయన్నారు. తెలుగు భాషతో పాటు, ఇంగ్లీషు, హిబ్రూ, గ్రీకు తదితర బాషలలో బైబిల్ గ్రంథాన్ని ప్రామాణికంగా తీసుకొని అత్యంత భక్తిశ్రద్ధలతో నిష్ఠగా పఠనం చేస్తేనే దినాలు, విశ్రాంతిదినము(సబ్బాత్), పండుగలు, ధర్మశాస్త్రమును ఎలోహిం(దేవుడు) శాస్త్రీయంగా వాస్తవాన్ని బయలుపర్చుతాడని బోధించారు. ఈ పండుగ సందర్భంగా వాయిద్యాలతో యావె, యాషువ మెస్సీయ గీతాలను విశ్వాసులు, యువకులు, చిన్నారులు భక్తిశ్రద్ధలతో పాడి ఆనందింపజేశారు. అనంతరం పరమతండ్రి యావె అంటూ యాషువ మెస్సీయ పేరున ప్రార్థనలు జరిపారు. ఈ పండుగ పరిశుద్ధ బైబిల్ గ్రంథం అంతటిలో పాత నిబంధనలో 49 సార్లు, క్రొత్త నిబంధనలో 3 సార్లు మొత్తంగా 52 సార్లు వ్రాయబడిందన్నారు. పూర్తి వివరాలకు సెల్ నెం. 9989841107 సంప్రదించండి. ఈ కార్యక్రమంలో సువార్త సహకారులు మోదుగు మోషే, అంబోజి జీవరత్నం, వడ్లమూడి ప్రశాంత్, బి. పౌలు (రూప్లాల్), పాలడుగు జీవన్, సామేలు, కొరకొప్పుల డేవిడ్, గడ్డం ఏబేలు, మోదుగు దానియేలు, రోహిత్, ఐజెక్, రామ్ స్నేహిత్, ప్రిన్స్, పాలడుగు అనిత, పావని, స్వరూప, కళమ్మ, రూతు, సునీత, సుధ, ఎస్తేరు తదితరులు పాల్గొన్నారు.

# అందరి కో ఆర్డినేషన్‌తో "మేము 'కాప్'లం" సిరీస్‌ను కేవలం 17 రోజుల్లోనే షూట్ పూర్తి చేశాం





– సినిమాటోగ్రాఫర్ కిషోర్ బోయిడాపు

దర్శకుడు ఆలోచనను వెండితెరపై అద్భుతంగా ఆవిష్కరించే బ్రహ్మ సినిమాటోగ్రాఫర్. అంతే కాదు.. నిర్మాత పెట్టే బడ్జెట్ వేల్యూని కూడా పదింతలు చేసి చూపించే మాయాజాలికుడు కూడా. సినిమాకు తండ్రి నిర్మాత.. తల్లి దర్శకుడైతే.. సినిమా స్టార్టింగ్ నుంచి ఎండింగ్ వరకు భుజం కాచే పెద్ద కొడుకు సినిమాటోగ్రాఫర్ అని అనటంలో సందేహం లేదు. ఇలాంటి కీలక శాఖలో తనదైన ప్రతిభను చూపిస్తున్నారు కిషోర్ బోయిడాపు. కెమెరా డిపార్ట్‌మెంట్‌లో చిన్న స్థాయి నుంచి తన ప్రయాణాన్ని ప్రారంభించిన ఈయన.. తెలుగు సినిమాలతో పాటు బాలీవుడ్, హాలీవుడ్ సినిమాల్లోనూ వర్క్ చేసి తనేంటో ప్రూవ్ చేసుకున్నారు. తాజాగా ఈయన ..నాగబాబు ప్రధాన పాత్రలో ప్రదీప్ మద్దాలి తెరకెక్కించిన సిరీస్ "మేము కాప్'లం" సిరీస్‌తో మన ముందుకు వచ్చి అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. ప్రస్తుతం ఈ సిరీస్ జీ5లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సిరీస్‌ను కేవలం 17 రోజుల్లోనే తెరకెక్కించటంలో కీలక పాత్రను పోషించిన కిషోర్ బోయిడాపు తన సినీ ప్రయాణం, ఎదురైన సవాళ్లు, సిరీస్‌కి సంబంధించిన ఎన్నో విశేషాల్ని పంచుకున్నారు. ఆయన ఏం చెప్పారంటే...

నేపథ్యం.. నా పూర్తి పేరు దుర్గ కిషోర్ కుమార్. మా ఫ్యామిలీ అంతా ఇండస్ట్రీలోనే ఉండటంతో సహజంగానే నాకు ఇంట్రెస్ట్ ఏర్పడి ఉంది. మా నాన్న గారు మమ్మల్ని ఫోటో తీసి.. ఆ ఫోటోలతోనే కథ చెప్పేవారు. అక్కడే నాకు ఈ ఫీల్డ్‌లోకి రావాలన్న ఇంట్రెస్ట్ వచ్చింది. అలా నాకు కెమెరా మీద చిన్నప్పటి నుంచే ఆసక్తి ఏర్పడింది.

సినీ ప్రయాణం.. 2002లో రవి ప్రసాద్ యూనిట్‌లో కెమెరా అసిస్టెంట్‌గా కెరీర్ స్టార్ట్ చేశా. ఓ నాలుగేళ్ల తరువాత ముంబైకి వెళ్లాను. అక్కడ మొదటి ప్రాజెక్ట్‌గా 'స్లమ్ డాగ్ మిలియనీర్'కి కెమెరా డిపార్ట్మెంట్‌లో పని చేశాను. ఆ తరువాత ఇంగ్లీష్ సినిమాలకి కూడా వర్క్ చేశాను. 'మిషన్ ఇంపాజిబుల్ 4' వంటి 15 హాలీవుడ్ చిత్రాలకు కూడా పని చేసిన అనుభవం ఉంది. 2012లో 'బాయ మీట్స్ గర్ల్' అనే సినిమాకి డీఓపీగా పని చేశా. అలా చేస్తున్న టైంలో 2015 లో అనిల్ మెహతా జర్నీ స్టార్ట్ అయ్యింది. ఆ జర్నీ 'ఏ దిల్ హై ముష్కిల్' సినిమా నుంచి ప్రారంభమై, 'జెర్సీ' సినిమా వరకు కొనసాగింది. ఈ ప్రయాణంలో మధ్యలో మరో పది సినిమాల్లో కూడా వర్క్ చేసే అవకాశం వచ్చింది. సార్‌తో కలిసి వన్ ఆఫ్ ది మెయిన్ అసిస్టెంట్‌గా పని చేయడం నా కెరీర్‌లో ఎంతో ఆనందాన్ని, మంచి అనుభవాన్ని ఇచ్చింది. ఆయన దగ్గర నేర్చుకున్న ప్రతి విషయం నా సినిమాటోగ్రఫీ జర్నీలో ఎంతో ఉపయోగపడింది. ఈ జర్నీలో నేర్చుకున్న ప్రతి విషయం నాకు చాలా విలువైనది.

థ్యాంక్స్ టు అనీల్ మెహతా

గారు. కోవిడ్ తర్వాత నాకు మై నేమ్ శృతి,105 మినిట్స్ వంటి సినిమాల్లో అవకాశం వచ్చినప్పుడు, నేను సార్‌తో మాట్లాడాను. అప్పుడాయాన.."వెళ్లి నీ సొంతంగా వర్క్ స్టార్ట్ చేయి" అంటూ ఎంతో ప్రోత్సాహం ఇచ్చారు. అలా మళ్లీ నేను కెమెరామెన్‌గా నా ప్రయాణాన్ని కొత్తగా ప్రారంభించాను. సవాలుతో కూడుకున్నది.. సింగిల్ షాట్‌లో సినిమా తీయడం అనేది సవాల్‌తో కూడుకున్న పని. హన్సిక గారితో చేసిన '105' సింగిల్ కారెక్టర్‌తో, సింగిల్ షాట్‌తోనే మూవీని చేశాం. ఇందులో ఉన్న శ్రమ ఆడియెన్స్‌కి అవసరం లేదు. ప్రేక్షకులకు సినిమా నచ్చిందా? లేదా? అన్నదే ముఖ్యం. కానీ సింగిల్ షాట్‌లో సినిమా తీయడం అనే దానికి వెనుకున్న కష్టం గురించి ఎవ్వరికీ తెలీదు. ఏ ఒక్క చోట మిస్టేక్ జరిగినా.. మళ్లీ మొత్తం మొదటి నుంచి చేయాల్సి వస్తుంది.దఫిల్మ్ నుంచి డిజిటల్.. ఒకప్పుడు ఫిల్మ్‌తో షూట్ చేసేవారు. ఇప్పుడంతా డిజిటల్‌లోకి మారింది. ఇప్పుడు ఎన్ని టేకులు అయినా తీసుకుంటున్నాం. ఒకప్పుడు లెంగ్త్‌ని చూస్తూ చిత్రీకరించేవారు. ఇప్పుడు అలాంటి లిమిటేషన్స్ ఏమీ లేవు. లెన్స్ గురించి అందరూ ఇప్పుడు ఎక్కువగా రీసెర్చ్ చేస్తున్నారు. మన కథ, బడ్జెట్‌లకు తగ్గట్టుగా లెన్స్‌ను సెలెక్ట్ చేసుకుంటాం. ప్రతీ ఒక్క లెన్స్‌ని రీసెర్చ్ చేసి.. కరెక్ట్ లెన్స్‌ని సెలెక్ట్ చేసుకోవడమే పెద్ద టాస్క్. నేను ఎక్కువగా కుక్ లెన్స్‌ని వాడతాను. షణ్ముఖ్ హీరోగా రానున్న 'ప్రేమకు నమస్కారం' మూవీకి కుక్ 7 లెన్స్‌ని వాడాను. వారినే ఫాలో అవుతా.. సినిమాటోగ్రఫీలో ఒక్కొక్కరిది ఒక్కో స్టైల్. రవి వర్మన్ గారు, అనీల్ మెహతా గారు, సుదీప్ చటర్జీ గారిని నేను ఎక్కువగా ఫాలో అవుతుంటాను. ఇదే చేయాలి అనే రూల్ అనేది ఉండదు. ఆ రోజు సీన్, ఆ రోజు పరిస్థితులను బట్టి మాట్ చేయాల్సి వస్తుంది. ఒత్తిడిలో కూడా కొన్ని సార్లు ఇంప్రూవ్ చేసే స్కోప్ ఉన్నా వదిలేయాల్సి వస్తుంది. మనకున్న టైమ్‌లో ఎంత బెస్ట్ ఇవ్వచ్చో అదే ముఖ్యం. హాలీవుడ్‌కి, మనకి తేడా అదే.. హాలీవుడ్ సినిమాల్లో కలర్ టోన్ ఎక్కువగా నేచురల్, సాఫ్ట్, మరియు సినిమాటిక్‌గా ఉంటుంది. వాళ్లు రియలిస్టిక్ లైటింగ్, కంట్రోల్డ్ కలరింగ్ ఉపయోగిస్తారు. ఇండియన్ సినిమాల్లో మాత్రం వైబ్రంట్ కలర్స్, రిచ్ స్కిన్ టోన్స్, ఎమోషనల్ లైటింగ్ ఎక్కువగా కనిపిస్తాయి. ఎందుకంటే మన కల్చర్ ఫెస్టివల్స్, కాస్ట్యూమ్స్, వాతావరణం, ఎమోషన్స్ ఇలా అన్నింటినీ బేస్ చేసుకుని చూస్తే మన స్టోరీ టెల్లింగ్‌తో అవన్నీ కనెక్టింగ్‌గా ఉంటాయి. అందుకనే మన సినిమాల్లో కలర్స్‌కు చాలా ప్రాముఖ్యం ఉంటుంది. హాలీవుడ్ సినిమాలు ఏస్, రా, హెచ్‌డిఆర్ వంటి అడ్వాన్స్ కలర్ వర్క్ ఫ్లోలను ఉపయోగిస్తాయి. ఇప్పుడు మన సినిమా కూడా అదే పంథాలో ముందుకు వెళుతుంది. ముఖ్యంగా ఓటీటీ ప్రాజెక్ట్స్‌లో. సింపుల్‌గా చెప్పాలంటే హాలీవుడ్ కలర్స్‌ను రియలిస్టిక్‌గా చూపిస్తుంది. ఇండియన్ సినిమా కలర్‌ను ఎమోషనల్‌గా, వేరు. మన కథలు వేరు, మన కల్చర్ వేరు, మన చుట్టు పక్కల ఉండే వారి కలర్స్ వేరు.. మనకు ఆ టోన్‌లో తీస్తే.. ఇక్కడి వరకు అంతగా నచ్చకపోవచ్చు. ఆ డిప్రెస్డ్ ఫీల్‌లో సినిమా తీయడం ఎందుకు. వాళ్లు,మనం సేమ్ లెన్స్ వాడతాం. కాకపోతే డీఐకి వాళ్లు ఎక్కువ టైం తీసుకుంటారు. ఇక్కడ మనకు అంత టైం ఉండదు. నాలుగైదు, లేయర్స్ చేసే వరకు సమయం అయిపోతుంది. అక్కడ స్కై బ్రైట్‌గా ఉంటే.. వీఎఫ్ఎక్స్ చేసుకుంటారు. లి 17 రోజుల్లోనే షూట్..లి "మేము కాప్'లం" మొత్తం షూటింగ్‌ను కేవలం 17 రోజుల్లో పూర్తి చేశాం. మంచి ప్రీ-ప్రొడక్షన్ ప్లానింగ్ వల్ల, అలాగే ప్రతి డిపార్ట్‌మెంట్ ఎంతో కష్టపడి పనిచేసినందువల్లే అది సాధ్యమైంది. ప్లానింగ్ నుంచి ఎగ్జిక్యూషన్ వరకు అందరూ తమ బెస్ట్ ఇచ్చి సజావుగా పూర్తయ్యేలా సపోర్ట్ చేశారు. ఈ ప్రయాణంలో ఎప్పుడూ క్లారిటీతో, సపోర్ట్‌తో ముందుండిన డైరెక్టర్ ప్రదీప్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు. మా మీద నమ్మకం ఉంచి ఈ ప్రాజెక్ట్‌కు అండగా నిలిచిన ప్రొడ్యూసర్ బీవీఎస్ రవి గారికి, అలాగే మొత్తం ప్రొడక్షన్ టీంకి హృదయపూర్వక కృతజ్ఞతలు. అలాగే నాగబాబు గారు, శ్రీను గారు, రవి గారు మరియు మొత్తం నటీనటులు, టెక్నీషియన్స్ అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు. అందరి సహకారం, టీమ్‌వర్క్ వల్ల షూట్‌ను సమయానికి విజయవంతంగా పూర్తి చేయగలిగాం. రెక్కీ చేస్తున్న టైంలోనే ఏ సీన్‌ని ఎలా తీయాలి.. ఎంతలో తీయాలి.. అనే దాన్ని నేను, ప్రదీప్ కలిసి డిస్కస్ చేసుకున్నాం. మేం ఆఫీస్‌లోనే ఎక్కువగా చర్చించుకున్నాం. ప్రీ ప్రొడక్షన్‌లోనే మేం ఓ క్లారిటీతో ఉన్నాం. అలా కో ఆర్డినేషన్‌తోనే సిరీస్‌ని అనుకున్న ముందుగానే ఫినిష్ చేశాం. దర్శకత్వ ఆలోచనలు.. కెమెరామెన్ టు డైరెక్టర్ అనేది అంత సులభమైన పని కాదు. డైరెక్షన్ అనేది చాలా రెస్పాన్సిబుల్ జాబ్. చాలా ఒత్తిడిని ఎదుర్కోవాల్సి ఉంటుంది. నాక్కూడా కొన్ని ఆలోచనలున్నాయి. కానీ ఇప్పట్లో మాత్రం అటు సైడ్ వెళ్లను. ప్రస్తుతం నేను ఏఐ టెక్నాలజీని నేర్చుకునే ప్రయత్నం చేస్తున్నాను. పస్తుతం చేస్తున్న ప్రాజెక్టులు.. 'ప్రేమకు నమస్కారం' రిలీజ్‌కు రెడీగా ఉంది. షణ్ముక్, శివాజీగారు, భూమికగారు ఇందులో నటించారు. అలాగే రాజీవ్ కనకాలగారు ప్రధాన పాత్రలో 'మన డాక్టర్ బాబు' అనే మరో మూవీ పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంటోంది. మరికొన్ని రెండు, మూడు సినిమాలు డిస్కషన్ స్టేజ్‌లో ఉన్నాయి.

## 'పురుష:' మూవీని చూసిన ప్రతీ ఒక్కరూ అభినందిస్తున్నారు..



థాంక్యూ మీట్‌లో హీరో పవన్ కళ్యాణ్ బత్తుల పవన్ కళ్యాణ్ బత్తుల హీరోగా కళ్యాణ్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద బత్తుల సరస్వతి సమర్పణలో బత్తుల కోటేశ్వరరావు నిర్మించిన చిత్రం 'పురుష:' ఈ సినిమాకి వీరు వులవల దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో పవన్ కళ్యాణ్, సప్తగిరి, కసిరెడ్డి రాజ్ కుమార్, రాయంచ కొక్కుర, విషిక, హాసిని సుధీర్ ముఖ్య పాత్రలను పోషించారు. ఈ సినిమాను మే 22న రిలీజ్ చేశారు. ప్రస్తుతం ఈ చిత్రం మంచి మౌత్ టాక్‌తో దూసుకుపోతోంది. ఈ క్రమంలో ఆదరిస్తున్న ప్రేక్షకులకు థాంక్స్ చెప్పేందుకు చిత్రయూనిట్ శనివారం నాడు థాంక్స్ మీట్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో.. పవన్ కళ్యాణ్ బత్తుల మాట్లాడుతూ .. "పురుష:' సినిమాని సపోర్ట్ చేసిన మీడియా వారికి థాంక్స్. నేను సత్యానంద్ మాస్టర్ గారి దగ్గర శిక్షణ తీసుకున్నాను. ఈ విషయాన్ని ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో చెప్పలేదు. ఒక వేళ నా నేను బాగా నటించకపోతే మీ పేరుకి ఎఫెక్ట్ అవుతుందని అనుకున్నాను. ఈ రోజు నా నటనకు మంచి పేరు వస్తోంది. అందుకే ఈ రోజు నేను సత్యానంద్ మాస్టర్ గారి శిష్యుడిని అని గర్వంగా చెప్పుకుంటున్నాను. ఇదంతా వీరు గారి వల్లే సాధ్యమైంది. ప్రీమియర్ల నుంచీ మా సినిమాకి మంచి టాక్ వచ్చింది. మూవీని చూసిన ప్రతీ ఒక్కరూ అభినందిస్తున్నారు. సప్తగిరి అన్న, కసిరెడ్డి అన్న నాకు ఈ ప్రయాణంలో తోడుగా నిలిచారు. రాయంచ, విషిక, హాసిని ఇలా అందరూ నాకు సపోర్ట్ ఇచ్చారు. సతీష్ గారు నన్ను చాలా డిఫరెంట్‌గా చూపించారు. శ్రవణ్ గారు మంచి పాటలు, బీజీఎం ఇచ్చారు. చిత్రంలో నటించిన ప్రతీ ఒక్క ఆర్టిస్ట్‌కి థాంక్స్. మూవీని చూసి నాలోని ప్లస్, మైనస్‌లు చెప్పండి. మైనస్‌లు చెబితే వాటిని నేను అధిగమించేందుకు ప్రయత్నిస్తాను. మా సినిమాని చూసి ఆదరిస్తున్న ప్రేక్షకులకు థాంక్స్. ఇంకా చూడనివారు మా మూవీని చూసి సపోర్ట్ చేస్తారని, మా కష్టాన్ని ఎంకరేజ్ చేస్తారని ఆశిస్తున్నాను' అని అన్నారు. నిర్మాత బత్తుల కోటేశ్వరరావు మాట్లాడుతూ .. "పురుష:' సినిమాను ఇంతటి స్థాయికి తీసుకు వెళ్లిన మీడియాకి థాంక్స్. ముగ్గురు హీరోయిన్లు చక్కగా నటించారు. వీరు ఈ మూవీని అద్భుతంగా తెరకెక్కించారు. కెమెరామెన్ సతీష్ గారు మంచి వ్యక్తి. సప్తగిరి గారు, కసిరెడ్డి గారు అద్భుతంగా నటించారు. పవన్ కళ్యాణ్ బత్తులని హీరోగా పెట్టి సినిమా తీస్తామని నా కంటే కోటీశ్వరులు ఫోన్ చేసి చెప్పారు. నేనే ఇంకో రెండు చిత్రాలు చేస్తానని వారికి చెప్పాను. ఎక్కడా కొత్త అబ్బాయిలా అనిపించలేదు. మా అబ్బాయి యాక్టింగ్ నాకు నచ్చింది. దర్శకుడు వీరు వులవల మాట్లాడుతూ .. "పురుష:' చిత్రాన్ని ఇంతలా సపోర్ట్ చేస్తున్న మీడియాకి థాంక్స్. బత్తుల కోటేశ్వరరావు గారి వల్లే ఈ ప్రాజెక్ట్ మొదలై ఇక్కడి వరకు వచ్చింది. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా సినిమాని నిర్మించారు. సోదరి సరస్వతి గారి సహకారం ఎప్పటికీ మర్చిపోలేను. రాయంచ, విషిక, హాసిని ఇలా హీరోయిన్లంతా అద్భుతంగా నటించారు. సప్తగిరి గారు, కసిరెడ్డి గారు ఎంతో సపోర్ట్ చేశారు. పవన్ కళ్యాణ్ ఈ మూవీకి ఓ పిల్లర్‌లా నిలబడ్డాడు. రెండు నెలలు వర్క్ షాప్ చేశాడు. ప్రతీ ఒక్క సీన్‌ను ఎన్నో సార్లు ప్రాక్టీస్ చేశాడు. అందుకే ఆడియెన్స్‌కి ఎక్కడా కూడా కొత్త కుర్రాడిలా అనిపించడు. ఈ జర్నీలో పవన్ కళ్యాణ్ నాకెంతో సపోర్ట్ చేశాడు. సతీష్ గారు, రవి గారు అందరూ నాకు అండగా నిలిచారు. మా ఆర్టిస్టులు, మా టీం కలిసి ఎంతో కష్టపడి ఈ మూవీని తీశాం. మా మూవీని ఆడియెన్స్ వరకు రీచ్ చేసిన మీడియాకి థాంక్స్. సినిమాని ఆదరిస్తున్న ఆడియెన్స్‌కి థాంక్స్' అని అన్నారు. కసిరెడ్డి రాజ్ కుమార్ మాట్లాడుతూ .. 'పవన్ కళ్యాణ్ చాలా మంచి వ్యక్తి. మొహమాటం ఎక్కువగా ఉంటుంది. ఫస్ట్ సినిమాలా జనాలకు అనిపించకూడదు.. అంత బాగా నటించాలని పవన్ కళ్యాణ్‌కి చెప్పాను. ఇప్పుడు ఆడియెన్స్ నుంచి అదే రెస్పాన్స్ వస్తోంది. పవన్ కళ్యాణ్ సక్సెస్ అయ్యాడు. నాకు ఆనందంగా ఉంది. రాయంచ అద్భుతంగా నటించారు. హాసిని, విషిక అందరూ చక్కగా నటించారు. సప్తగిరి అన్నతో నటించడం ఆనందంగా ఉంది. నాలుగేళ్ల నుంచి వీరు గారితో పరిచయం ఉంది. నన్ను గుర్తు పెట్టుకుని పాత్రను ఇచ్చిన వీరు గారికి థాంక్స్. కెమెరామెన్ సతీష్ గారు బడ్జెట్‌ను కంట్రోల్‌లో పెడతారు. ఆర్ట్ డైరెక్టర్ రవి గారు చాలా పాజిటివ్ వ్యక్తి. మా సినిమాని ఆడియెన్స్ వరకు రీచ్ చేసిన మీడియాకి థాంక్స్' అని అన్నారు. రాయంచ మాట్లాడుతూ .. "పురుష:' మూవీని మీడియా ముందుండి సపోర్ట్ చేస్తూ వచ్చింది. ఇది నాకు తొలి చిత్రం. ఇంత పాజిటివ్ వైబ్స్ చూస్తుండటం ఆనందంగా ఉంది. దీనంతటికి మా దర్శక, నిర్మాతలే కారణం. నాకు సపోర్ట్ చేసిన పవన్ కళ్యాణ్‌కి థాంక్స్. మా సినిమాని ఇంకా ఇలానే ఆదరిస్తూ ఉండాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. విషిక మాట్లాడుతూ .. 'మహిళా ప్రేక్షకులు 'పురుష:' మూవీని చూసి ఎక్కువగా ప్రశంసలు కురిపిస్తున్నారు. నాకు ఇంత మంచి పాత్రను ఇచ్చిన వీరు గారికి థాంక్స్. ఈ జర్నీలో సపోర్ట్ చేసిన కోటేశ్వరరావు గారికి థాంక్స్. సినిమాని చూసిన వాళ్లు మళ్లీ చూడండి.. చూడని వాళ్లు వెంటనే వెళ్లి చూడండి' అని అన్నారు. హాసిని సుధీర్ మాట్లాడుతూ .. "పురుష:' మూవీని మీడియా చాలా బాగా ప్రమోట్ చేసింది. మా సినిమాని ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. అందరం కష్టపడి ఈ చిత్రాన్ని చేశాం. ఇంకా చూడని వాళ్లు ఉంటే వెంటనే అందరూ చూసి ఎంజాయ్ చేయండి' అని అన్నారు. నటి సంధ్య మాట్లాడుతూ .. "పురుష:'లో నా పాత్రకు మంచి రెస్పాన్స్ వస్తోంది. నన్ను నమ్మి అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్' అని అన్నారు. కెమెరామెన్ సతీష్ మాట్లాడుతూ .. "పురుష:' మూవీ విషయంలో కోటేశ్వరరావు గారు ఎక్కడా కాంప్రమైజ్ కాలేదు. పవన్ కళ్యాణ్‌కి సక్సెస్ రావడం ఆనందంగా ఉంది. ఇలానే మా జర్నీ కంటిన్యూ అవ్వాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. ఆర్ట్ డైరెక్టర్ రవి మాట్లాడుతూ .. "పురుష:' మూవీని సక్సెస్ చేసిన ఆడియెన్స్‌కి థాంక్స్. ఈ సినిమాకి పని చేసిన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నాను' అని అన్నారు.

## జాఫర్‌ఖాన్‌పేటలో భారీ అగ్నిప్రమాదం.. గ్రామస్తుల అప్రమత్తతో తప్పిన పెనుప్రమాదం

**కాల్వశ్రీరాంపూర్** : కాల్వశ్రీరాంపూర్ మండలంలోని జాఫర్‌ఖాన్‌పేటలో ఆదివారం భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తులు గ్రామ శివారులోని పంట పొలాల్లో కొయ్యకాలుకు మంట పెట్టడంతో భారీగా మంటలు చెలరేగి వరి పొలాలంతా వ్యాపించాయి. సమీపంలో ఉన్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రంవైపు, గ్రామ సమీపంలో ఉన్న ఇండ్లవైపు భారీ గా మంటలు చెలరేగాయి. దీంతో సర్పంచ్ యాదగిరి జ్యోత్స్న శ్రీనివాస్ తో పాటు గ్రామస్తులు తేరుకొని మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. అటువైపు ఫైర్ ఇంజన్‌కు సమాచారమిచ్చారు. రెండు ఫైర్ ఇంజన్లతో పాటు గ్రామస్తులు, చుట్టుపక్కల ఉండి మంటలను అదుపులోకి తెచ్చారు. మరోవైపు ట్రాక్టర్ల సహాయంతో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం చుట్టు మట్టి కుప్పలు పోసి మంటలు రాకుండా చేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో పలువురు రైతులకు చెందిన వరి కొయ్యకాలుతో పాటు, విద్యుత్ వైర్లు, పైపులు, మోటార్లు మంటల్లో కాలి బూడిదయ్యాయి. ఈరవేన లస్మమ్మ కు చెందిన పూరి గుడిసెకు నిప్పంటుకుంది. వెంటనే మంటలను ఆర్పివేయడంతో పాక్షికంగా దగ్ధమైంది. రూ.లక్షల్లో ఆస్థినష్టం జరిగినట్లు గ్రామస్తులు వాపోయారు. వరికొయ్యకాలుకు నిప్పంటించిన వారిని గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ జ్యోత్స్న శ్రీనివాస్, గ్రామస్థులు కోరుతున్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వం

**ధర్మారం** : రాష్ట్ర ప్రభుత్వం ఈ యాసంగి సీజన్లో రైతులు పండించిన వరి, మక్క ఇతర ధాన్యం కొనుగోలులో పూర్తిగా విఫలమైందని రాష్ట్ర మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలోని కరీంనగర్-రాయపట్నం రహదారిపై ధాన్యం కొనుగోళ్ల జాప్యంపై నిరసిస్తూ రైతులకు మద్దతు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం రాస్తారోకో నిర్వహించారు. వరి ధాన్యం రోడ్డుమీద పోసి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. రాస్తారోకోతో వాహనాలు నిలిచిపోయాయి. ఈ ఆందోళన కార్యక్రమానికి హాజరైన ఈశ్వర్ మాట్లాడుతూ గతంలో మాజీ సీఎం కేసీఆర్ పాలనలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేశామని ఆయన గుర్తు చేశారు. తాను సైతం ధర్మపురి నియోజకవర్గంలో తిరిగి కొనుగోలు కేంద్రాలలో పర్యటించి రైతులకు వారికి అన్ని విధాలుగా అండగా నిలబడి ధాన్యం కొనుగోలు చేయించామని అన్నారు. కానీ ఈ సారి మాత్రం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో పూర్తిగా విఫలమైనట్లు ఆయన ధ్వజమెత్తారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 15 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి కాగా ఇప్పటివరకు సగం ధాన్యం కూడా ప్రభుత్వం కొనుగోలు చేయలేదని ఆయన చెప్పుకొచ్చారు. జగిత్యాల జిల్లాకు ఇన్చార్జిగా ఉన్న మంత్రి లక్ష్మణ్ కుమార్ ఆ జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల విషయంలో పూర్తిగా వైఫల్యం చెందినట్లు ఈశ్వర్ ఆరోపించారు. క్వింటాల్ ధాన్యం తూకంలో 7-8 కిలోల తరుగు తీయడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నట్లు ఆయన ఆరోపించారు. ఒక్కో లారీ లోడ్ కు రైతులు సుమారు రూ. 8 వేలు నష్టపోతున్నారని ఆయన ఆరోపించారు. గతంలో తమ ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రతీ చిన్నదానికి రైతులను పక్కదారి పట్టించి లక్ష్మణ్ కుమార్ ఆందోళన చేసిన సందర్భాలు ఉన్నాయని పేర్కొన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ధాన్యం కటింగ్ వచ్చిన సొమ్ము ఏమవుతుందని ఆ రోజు లక్ష్మణ్ కుమార్ ప్రశ్నించారని అదే ఇప్పుడు కటింగ్ అవుతున్న సొమ్ము లక్ష్మణ్ కుమార్ జేబులోకి వెళుతుందా.. అని ఈశ్వర్ ప్రశ్నించారు. రైతులకు జవాబు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల విషయంలో తీవ్రమైన జాప్యం జరిగి రైతులకు నష్టం వాటిలోతున్నది వాస్తవమే కానీ జగిత్యాల జిల్లాలో మాత్రం కటింగ్ పేరా విపరీతమైన దోపిడీ జరుగుతుందని ఆ విషయం కొనుగోలు కేంద్రాలకు లక్ష్మణ్ కుమార్ వచ్చి పరిశీలిస్తే వాస్తవాలు తెలుస్తాయని ఆయన వివరించారు. ఇంట్లో ఉండి అంతా బాగానే ఉందని ప్రకటించే లక్ష్మణ్ కుమార్ కు దాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి అవగాహన లేదని ఆయన ఎద్దేవా చేశారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు జరుగుతున్న విషయాన్ని తాను నిరూపించడానికి సిద్ధంగా ఉన్నానని కేంద్రాలకు వచ్చే దమ్ము ధైర్యం లక్ష్మణ్ కుమార్ కు ఉందా అని ఈశ్వర్ సవాల్ విసిరారు. మాటిమాటికి ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి గుడిలో తడి బట్టలతో స్నానం చేస్తానని ప్రకటించే లక్ష్మణ్ కుమార్ ఒక్కసారి కొనుగోలు కేంద్రాలకు వచ్చి రైతులకు జరుగుతున్న నష్టం తెలుసుకోవాలని ఆయన సూచించారు. కేవలం కాన్వాయ్ ముందు నాలుగు కార్లు, వెనుక నాలుగు కార్లతో లక్ష్మణ్ కుమార్ ఒకవైపు, అతడిని అనుసరిస్తున్న కార్యకర్తలు మాత్రమే ఆనందంగా ఉన్నారని, రైతులు మాత్రం ఆనందంగా లేరని ఆయన పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో చేయని వాగ్దానం లేదని, ఆడని అబద్ధం లేదని అబద్దానికి కేరాఫ్ లక్ష్మణ్ కుమార్ అని ఈశ్వర్ ధ్వజమెత్తారు.

## వీటిని చాలా మంది వ్యర్థాలుగా పడేస్తుంటారు.. కానీ ఈ విషయాలు తెలిస్తే ఇకపై పడేయరు..



ఆహారాన్ని వృథా చేయకుండా ప్రతి పదార్థాన్ని పూర్తిగా ఉపయోగించుకోవడం భారతీయ వంటింటి ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. ముఖ్యంగా పండ్ల తొక్కలు, గింజలు, మిగిలిపోయిన భాగాలను చాలామంది నేరుగా చెత్తబుట్టలో వేస్తుంటారు. అయితే కొంచెం సృజనాత్మకంగా ఆలోచిస్తే ఇవే రుచికరమైన వంటకాలు, ఆరోగ్యకరమైన స్నాక్స్, శీతల పానీయాలుగా మారవచ్చు. వేసవిలో ఎక్కువగా తినే పండ్ల మిగతా భాగాలను ఇంట్లో ఎలా ఉపయోగించుకోవచ్చో ఇప్పుడు తెలుసుకుందాం. పుచ్చకాయలో ఎర్రని గుజ్జు తిన్న తర్వాత మిగిలే తెల్లని భాగాన్ని చాలామంది పారేస్తారు. కానీ ఈ భాగంతో రుచికరమైన కూర తయారు చేయవచ్చు. బయట గట్టిగా ఉండే ఆకుపచ్చ పొర తీసేసి తెల్లటి భాగాన్ని ముక్కలుగా కోసి ఆవాలు, పచ్చిమిర్చి, పసుపు, ఆమ్‌చూర్‌తో వండితే సొరకాయ కూరలాగే మంచి రుచితో ఉంటుంది. మసాలాలు బాగా పట్టి ప్రత్యేకమైన టెక్స్చర్ ఇస్తుంది.

**తర్బూజా గింజలు..**

అలాగే తర్బూజా లేదా మస్క్‌మిలన్ గింజలను కూడా ఆరోగ్యకరమైన స్నాక్‌గా మార్చుకోవచ్చు. గింజలను శుభ్రంగా కడిగి ఎండబెట్టి నెయ్యిలో వేయించి అందులో బ్లాక్ సాల్ట్, చాట్ మసాలా, వేయించిన జీలకర్ర పొడి కలిపితే మంచి కరకరలాడే స్నాక్ సిద్ధమవుతుంది. వీటిని మఖానాల్లా తినవచ్చు. పోహా, చాట్‌లపై టాపింగ్‌గా కూడా ఉపయోగించవచ్చు. నారింజ, నిమ్మ, బత్తాయి తొక్కల్లో సువాసన గల నూనెలు అధికంగా ఉంటాయి. ఈ తొక్కలను ఎండలో లేదా తక్కువ ఉష్ణోగ్రతలో డ్రై చేసి పొడిగా చేసుకుంటే వంటల్లో ఉపయోగించవచ్చు. ఈ పొడిని కేకులు, టీ, మెరినేడ్లు, డెజర్ట్‌లలో కలిపితే మంచి ఫ్లేవర్ వస్తుంది.

**నిమ్మ, నారింజ తొక్కలు..**

అదే విధంగా నిమ్మ లేదా నారింజ తొక్కలతో భోజనం తిన్న తర్వాత తీసుకునే చిన్న డైజెస్టివ్ మిఠాయిలను కూడా తయారు చేయవచ్చు. తొక్కలను మరిగించి పాకంలో ఉడికించి తర్వాత చక్కెర, బ్లాక్ సాల్ట్ కలిపితే తీపి, పులుపు, స్వల్ప చేదు రుచులతో ప్రత్యేకమైన క్యాండీలా మారుతుంది. భోజనం తర్వాత తింటే రుచిగా ఉంటుంది. యాపిల్, పియర్, అనాస, బెర్రీల తొక్కలు, మిగిలిపోయిన భాగాలతో ఇంట్లోనే ఫ్రూట్ వెనిగర్ తయారు చేయవచ్చు. ఒక సీసాలో నీరు, చక్కెరతో కలిసి వీటిని కొన్ని రోజులు ఉంచితే సహజంగా ఫర్మెంటేషన్ జరిగి వెనిగర్ తయారవుతుంది. దీనిని సలాడ్ డ్రెస్సింగ్, మెరినేడ్ లేదా ఇంటి శుభ్రత కోసం కూడా ఉపయోగించవచ్చు.

**పుచ్చకాయ తొక్కలు..**

నారింజ తొక్కలతో ప్రత్యేకమైన చట్నీ కూడా తయారు చేయవచ్చు. తొక్కలను ముందుగా మరిగించి చేదు తగ్గించి, బెల్లం, చింతపండు, ఎర్ర మిర్చి, వేయించిన జీలకర్రతో గ్రైండ్ చేస్తే తీపి, పులుపు, కారం కలిసిన రుచికరమైన చట్నీ సిద్ధమవుతుంది. సాధారణ దాల్-చావల్‌కే కొత్త రుచి తీసుకొస్తుంది. అనాస, పుచ్చకాయ తొక్కలు లేదా సిట్రస్ పండ్ల మిగిలిన భాగాలతో వేసవికి సరిపోయే శర్బత్ కూడా తయారు చేయవచ్చు. వీటిని చక్కెర, పుదీనా, బ్లాక్ సాల్ట్, కొద్దిగా నిమ్మరసంతో మరిగించి వడగట్టి చల్లబరిస్తే రుచికరమైన సిరప్ సిద్ధమవుతుంది. దీన్ని చల్లని నీరు లేదా సోడాతో కలిపి తాగితే శరీరానికి తేమను అందిస్తుంది. ఆహార వ్యర్థాలు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న సమస్యగా మారుతున్నాయి. ముఖ్యంగా పండ్ల తొక్కలు, గింజలే ఎక్కువగా వృథా అవుతున్నాయి. కానీ కొద్దిగా శ్రద్ధ పెడితే ఇవే రుచికరమైన వంటకాలు, ఆరోగ్యకరమైన పానీయాలుగా మారి ఇంటి వంటల్లో కొత్త రుచులను తీసుకువస్తాయి

## ఎన్ని చేసినా చర్మ సమస్యలు తగ్గకపోతే.. అందుకు అనేక కారణాలు ఉంటాయి.. వాటిని కచ్చితంగా తెలుసుకోవాల్సిందే..



చర్మం మసకబారడం, అలసటగా కనిపించడం లేదా అసమాన రంగుతో కనిపించడం ప్రారంభమైనప్పుడు చాలా మంది వెంటనే కొత్త స్కిన్‌కేర్ ఉత్పత్తులను ప్రయత్నించడం మొదలుపెడతారు. కొత్త సీరమ్ లేదా ఫేస్ మాస్క్ తాత్కాలికంగా కొంత మెరుగుదల ఇస్తుంది. కానీ నిరంతరంగా కనిపించే డల్ స్కిన్ సమస్యకు ఒక్క ఉత్పత్తి లోపమే కారణం కాదని నిపుణులు చెబుతున్నారు. క్లినికల్ స్కిన్ ప్రాక్టీస్‌లో చర్మం మసకబారడం అనేది శాస్త్రీయంగా రూపొందించిన సరైన చికిత్స, సరైన ఫార్ములేషన్స్, జీవనశైలి మార్పులు అవసరమనే సంకేతంగా ఎక్కువగా కనిపిస్తుందని అంటున్నారు. అన్ని రకాల చర్మాల్లోనూ డల్‌నెస్‌కు అనేక అంతర్గత, బాహ్య కారణాలు ఉంటాయి. మానసిక ఒత్తిడి, తగిన నిద్ర లేకపోవడం, ఎక్కువసేపు స్క్రీన్‌ల ముందు గడపడం, కాలుష్యం, డీహైడ్రేషన్, సెబమ్ అసమతుల్యత, మైక్రోబియోమ్ లోపాలు, మెలనిన్ అసమాన పంపిణీ, కొల్లాజెన్ ఉత్పత్తి తగ్గడం వంటి అంశాలు చర్మ కాంతిని ప్రభావితం చేస్తాయి. దీర్ఘకాలంలో ఇవి చర్మపు రక్షణ పొరను బలహీనపరచి సహజ కాంతిని తగ్గిస్తాయి. అందుకే ఎన్నాళ్లుగానో వాడుతున్న స్కిన్‌కేర్ రొటీన్ కూడా ఒక దశ తర్వాత ఫలితం ఇవ్వదు.

**నీరు తగినంత లేకపోవడం..**

డల్ స్కిన్‌ను తగ్గించడంలో మొదటి, అత్యంత ముఖ్యమైన దశ దానికి కారణమేమిటో తెలుసుకోవడం. కొందరిలో నీటి లోపం, తగిన మాయిశ్చర్ లేకపోవడం ప్రధాన కారణం అవుతాయి. మరికొందరిలో సన్ డ్యామేజ్, ఆక్సిడేటివ్ స్ట్రెస్, పిగ్మెంటేషన్ సమస్యలు లేదా అసమతుల జీవనశైలి కారణమవుతాయి. శారీరక వ్యాయామం లేకపోవడం, అధిక ఒత్తిడి వల్ల ఎండోర్ఫిన్ స్థాయిలు తగ్గిపోవడం కూడా చర్మ కాంతిపై ప్రభావం చూపుతాయని నిపుణులు చెబుతున్నారు. సరైన స్కిన్ అసెస్‌మెంట్ ద్వారా అసలు సమస్యను గుర్తిస్తే, చికిత్స కూడా మరింత టార్గెటెడ్‌గా, ఫలితాలిచ్చే విధంగా ఉంటుంది. చర్మంపై పేరుకుపోయే మృతకణాలు, అదనపు ఆయిల్, కాలుష్యపు కణాలను తొలగించకపోతే చర్మం మరింత డల్‌గా కనిపిస్తుంది. ప్రొఫెషనల్ డీప్ క్లెన్సింగ్, ఎక్స్‌ఫోలియేషన్ ఫేషియల్స్ చర్మ పునరుత్పత్తిని వేగవంతం చేస్తాయి. అలాగే చర్మానికి ఆక్సిజన్, పోషకాలు సరిగా అందేలా చేసి ఫ్రెష్ లుక్‌ను తీసుకువస్తాయి.

**చర్మ రక్షణ పొర బలహీనపడితే..**

తగినంత తేమ లేకపోవడం డల్ స్కిన్‌కు ప్రధాన కారణాల్లో ఒకటి. డీహైడ్రేటెడ్ చర్మం రఫ్‌గా, అలసటగా కనిపిస్తుంది. ఆక్సిజన్ ఫేషియల్స్, మాయిశ్చర్ రీప్లెనిషింగ్ ట్రీట్‌మెంట్స్ వంటి హైడ్రేషన్ ఆధారిత థెరపీలు చర్మంలోని లోతైన పొరల్లో నీటి సమతుల్యతను పునరుద్ధరిస్తాయి. సరైన నీటి సేవనం, సమతుల ఆహారం, ఎలక్ట్రోలైట్ బ్యాలెన్స్ కూడా చర్మ కాంతిని మెరుగుపరుస్తాయి. చర్మ రక్షణ పొర బలహీనపడితే నీటి నష్టం పెరుగుతుంది. అదే సమయంలో కాలుష్యం, ఆక్సిడేటివ్ స్ట్రెస్, ఇన్‌ఫ్లమేషన్ ప్రభావం కూడా ఎక్కువవుతుంది. అలాంటి పరిస్థితుల్లో ఎక్కువ యాక్టివ్ కెమికల్స్ వాడడం కంటే స్కిన్ బ్యారియర్ రిపేర్‌పై దృష్టి పెట్టాలని నిపుణులు సూచిస్తున్నారు. జెంటిల్ స్కిన్‌కేర్, సూతింగ్ థెరపీలు, మైక్రోబియోమ్ సపోర్టివ్ ఫార్ములేషన్స్, బ్యారియర్ రిపేర్ ఫేషియల్స్ చర్మాన్ని మళ్లీ ఆరోగ్యంగా మారుస్తాయి. టానింగ్, పిగ్మెంటేషన్, సన్ డ్యామేజ్ కారణంగా కూడా చర్మం మసకబారుతుంది. కంట్రోల్డ్ ఎక్స్‌ఫోలియేషన్, స్కిన్ రీజువెనేషన్ ప్రొసీజర్స్ చర్మ టెక్స్చర్‌ను మెరుగుపరుస్తాయి. వెంటనే రంగు మార్పు కోసం కాకుండా, చర్మ నాణ్యతను క్రమంగా మెరుగుపరచడమే ఈ చికిత్సల అసలు లక్ష్యం.

**జీవనశైలి ముఖ్యం..**

ఎంత ఖరీదైన స్కిన్‌కేర్ చేసినా సరైన జీవనశైలి లేకపోతే దీర్ఘకాల ఫలితాలు రావు. మంచి నిద్ర, సమతుల ఆహారం, ఒత్తిడి నియంత్రణ, క్రమమైన వ్యాయామం, తగినంత నీటి సేవనం వంటి అంశాలు చర్మ ఆరోగ్యంపై నేరుగా ప్రభావం చూపుతాయి. కొల్లాజెన్ ఉత్పత్తి, హార్మోన్ బ్యాలెన్స్, ఇన్‌ఫ్లమేషన్ నియంత్రణకు ఇవి కీలకం. తి వ్యక్తి చర్మ నిర్మాణం భిన్నంగా ఉంటుంది. కొందరికి హైడ్రేషన్, బ్యారియర్ రిపేర్ అవసరమైతే, మరికొందరికి పిగ్మెంటేషన్ కరెక్షన్, యాంటీ ఆక్సిడెంట్ సపోర్ట్ లేదా రీజువెనేషన్ థెరపీలు అవసరం అవుతాయి. సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్న రొటీన్‌లను అనుసరించడం కంటే, వ్యక్తిగత చర్మ అవసరాలకు అనుగుణంగా రూపొందించిన స్టెప్ బై స్టెప్ స్కిన్ మేనేజ్‌మెంట్ ప్లాన్ దీర్ఘకాలంలో మెరుగైన ఫలితాలను ఇస్తుందని నిపుణులు సూచిస్తున్నారు.

## ఇంట్లో తయారు చేసే కాఫీ రుచిగా రావడం లేదా.. అయితే వీటిపై ఓ లుక్కేయండి..



ఇంట్లో కాఫీ తయారు చేసే సమయంలో చాలామంది అంచనాలకే ఆధారపడతారు. కానీ మంచి కాఫీ రుచి రావడంలో సరైన కొలతలు చాలా కీలకమని నిపుణులు చెబుతున్నారు. కేవలం రూ.300 నుంచి రూ.500 మధ్యలో దొరికే చిన్న కిచెన్ స్కేల్ ఉపయోగిస్తే కాఫీ తయారీలో ఉండే ఊహాగానాలు పూర్తిగా తగ్గిపోతాయి. కాఫీ పొడి ఎక్కువైతే కాఫీ రుచి మరీ గట్టిగా, కొన్నిసార్లు చేదుగా మారుతుంది. అదే తక్కువైతే కాఫీ రుచి లేకుండా నీళ్లలా అనిపిస్తుంది. అందుకే కాఫీ పొడి, నీటి నిష్పత్తిని కొలిచి తయారు చేయడం వల్ల ప్రతిసారీ ఒకే రకమైన రుచి పొందవచ్చు. కొద్ది రోజులు ఇలా కొలతలతో తయారు చేస్తే తర్వాత సహజంగానే సరైన అంచనా వచ్చేస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. కేఫ్‌లలో కాఫీకి ఒకే రకమైన రుచి రావడానికి ప్రధాన కారణం అక్కడి బారిస్టాలు ప్రతి దశను కచ్చితంగా పాటించడమే. కాఫీ పరిమాణం, నీటి ఉష్ణోగ్రత, తయారీ సమయం వంటి అంశాలను నిరంతరం గమనిస్తూ ఉంటారు. ఇంట్లో కూడా కనీసం సాధారణ స్థాయిలో ఈ పద్ధతులను పాటిస్తే కేఫ్ కాఫీకి దగ్గరగా రుచి పొందవచ్చని చెబుతున్నారు.

**గాలి, తేమ, వేడి, వెలుతురు శత్రువులు..**

కాఫీని నిల్వ చేసే విధానం కూడా రుచిపై ప్రభావం చూపుతుంది. గాలి, తేమ, వేడి, వెలుతురు కాఫీకి ప్రధాన శత్రువులుగా భావిస్తారు. కాఫీని కొనుగోలు చేసిన టిన్ లేదా ప్యాకెట్‌లో కొద్ది రోజుల పాటు ఉంచవచ్చు. అయితే ప్యాకెట్ ఓపెన్ చేసిన తర్వాత గాలి చొరబడని డబ్బాలో నిల్వ చేయడం మంచిదని సూచిస్తున్నారు. స్టవ్ దగ్గర లేదా నేరుగా సూర్యకాంతి పడే ప్రదేశాల్లో కాఫీని ఉంచకూడదు. అలాగే ఫ్రిజ్ లేదా ఫ్రీజర్‌లో నిల్వ చేయడం కూడా మంచిది కాదు. ఉష్ణోగ్రతల మార్పుల వల్ల తేమ ఏర్పడి కాఫీ గింజల నాణ్యత దెబ్బతినే అవకాశం ఉంటుంది. సెరామిక్ లేదా స్టెయిన్‌లెస్ స్టీల్‌తో తయారైన చిన్న ఎయిర్‌టైట్ డబ్బాలు కాఫీ తాజాదనాన్ని ఎక్కువకాలం నిల్వ ఉంచడంలో సహాయపడతాయి. ఒకేసారి పెద్ద మొత్తంలో కొనుగోలు చేయడం కంటే చిన్న పరిమాణాల్లో తరచూ కొనడం మంచిది. ఉదాహరణకు మూడు వారాల్లో ఉపయోగించే 250 గ్రాముల కాఫీ, రెండు నెలలు వాడే 500 గ్రాముల కాఫీ కంటే మెరుగైన రుచి ఇస్తుంది.

**ఖరీదైన మెషీన్లతో పనిలేదు..**

గత దశాబ్దంలో భారత్‌లో కాఫీ మార్కెట్ భారీగా అభివృద్ధి చెందిందని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం మంచి నాణ్యత గల కాఫీ గింజలు, పరికరాలు, తయారీపై సమాచారం సులభంగా అందుబాటులోకి వచ్చాయి. మంచి కాఫీ కోసం ఖరీదైన మెషీన్లు అవసరం లేదు. సరైన అలవాట్లు ఉంటే ఇంట్లోనే అద్భుతమైన కాఫీ తయారు చేయవచ్చు. తాజా కాఫీ గింజలు, సరైన గ్రైండ్, తగిన ఉష్ణోగ్రతలో నీరు, సులభమైన తయారీ విధానం, కొలతల్లో స్థిరత్వం, సరైన నిల్వ పద్ధతి వంటి ఆరు అంశాలు ఉదయపు కాఫీ రుచిని పూర్తిగా మార్చగలవు. కేఫ్ అనుభవానికి అసలు కారణం ఖరీదైన పరికరాలు కాదు, ప్రతి దశలో చూపే శ్రద్ధేనని పేర్కొంటున్నారు.







## రాయలసీమ యాసలో అఖిల్ కొత్త ప్రయోగం.. 'లెనిన్'తో భారీ హిట్‌పై ఫుల్ ఫోకస్!

అక్కినేని యువ హీరో అఖిల్ ప్రస్తుతం తన కెరీర్‌లో అత్యంత కీలకమైన ప్రాజెక్ట్‌గా భావిస్తున్న 'లెనిన్' సినిమాతో బిజీగా ఉన్నాడు. దర్శకుడు మురళీ కిషోర్ అబ్బూరి (నందు) తెరకెక్కిస్తున్న ఈ చిత్రం ఇప్పటికే సినీ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది. ఇటీవల విడుదలైన టీజర్ ప్రేక్షకుల నుంచి మంచి స్పందన అందుకోవడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. ఈ చిత్రం ప్రత్యేకత ఏమిటంటే, కథ మొత్తం రాయలసీమ బ్యాక్‌డ్రాప్ నేపథ్యంలో సాగనుండటం. ముఖ్యంగా చిత్తూరు ప్రాంత జీవనశైలి, అక్కడి పరిస్థితులు, స్థానిక సంస్కృతిని ప్రధానంగా చూపించనున్నట్లు తెలుస్తోంది. కథలోని పాత్రల సహజత్వాన్ని ప్రేక్షకులకు దగ్గర చేయాలనే ఉద్దేశంతో దర్శకుడు యాసకు కూడా ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారని సమాచారం. సినిమాలో ప్రధాన పాత్రల సంభాషణలు పూర్తిగా రాయలసీమ యాసలోనే ఉండనున్నాయి. ముఖ్యంగా అఖిల్ పాత్రకు కూడా అదే తరహా డైలాగ్ డెలివరీ ఉండబోతోందట. టీజర్‌లో అఖిల్ వాయిస్ కొంత భిన్నంగా అనిపించినా, సినిమాలో మాత్రం ఆయన స్వరానికే రాయలసీమ యాసను జోడించేలా ప్రత్యేకంగా వర్క్ చేస్తున్నారని తెలుస్తోంది. ఇప్పటివరకు తన కెరీర్‌లో ఎక్కువగా క్లాస్, అర్బన్ షేడ్స్ ఉన్న పాత్రల్లో కనిపించిన అఖిల్‌కు ఇది పూర్తిగా కొత్త ప్రయోగంగా భావిస్తున్నారు. రాయలసీమ యాసలో డైలాగ్స్ చెప్పడం, స్థానిక భాషా శైలిని అలవాటు చేసుకోవడం వంటి అంశాలపై అఖిల్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో అందాల భామ భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. అఖిల్-భాగ్యశ్రీ జంట మధ్య వచ్చే ప్రేమ సన్నివేశాలు సినిమాలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని చిత్ర యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ చాలా సహజంగా వచ్చిందని, ముఖ్యంగా ఎమోషనల్ మరియు లవ్ ట్రాక్ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుందని సమాచారం. ఇక అఖిల్ ఈ సినిమాపై భారీ ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది.

## కామాఖ్యా దేవి ఆలయంలో సూర్య-జ్యోతిక ప్రత్యేక పూజలు.. వైరల్ అవుతున్న స్టార్ కపుల్ ఫోటోలు

కోలీవుడ్‌లో అత్యంత అభిమానాన్ని సంపాదించిన జంటల్లో సూర్య--జ్యోతిక జంటకు ప్రత్యేక స్థానం ఉంది. తెరపై తమ అద్భుతమైన కెమిస్ట్రీతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ జంట, నిజ జీవితంలోనూ ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నారు. వ్యక్తిగత జీవితాన్ని, కెరీర్‌ను సమతూకంగా కొనసాగిస్తూ అభిమానుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు.ప్రస్తుతం ఈ స్టార్ కపుల్ కెరీర్ పరంగా కూడా మంచి జోష్‌లో ఉన్నారు. ఇటీవల సూర్య నటించిన 'కరుప్పు' చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకోగా, జ్యోతిక ప్రధాన పాత్రలో నటించిన 'సిస్టం' సినిమా కూడా మంచి స్పందనను అందుకుంది. వరుస విజయాలతో ఫుల్ హ్యాపీగా ఉన్న ఈ జంట తాజాగా ఆధ్యాత్మిక యాత్రకు వెళ్లారు. దీనిలో భాగంగా సూర్య, జ్యోతిక కలిసి అస్సాంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కామాఖ్యా దేవి అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం అక్కడ కొన్ని ప్రత్యేక ఫోటోలకు పోజులిచ్చారు. సాంప్రదాయ దుస్తుల్లో సూర్య, జ్యోతిక ఎంతో సింపుల్‌గా, ప్రశాంతంగా కనిపించారు. వీరిద్దరూ కలిసి దిగిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతున్నాయి. అభిమానులు కూడా ఈ ఫోటోలను పెద్ద ఎత్తున షేర్ చేస్తూ ప్రశంసలు కురిపిస్తున్నారు. "ఎవర్‌గ్రీన్ జంట", "సక్సెస్ తర్వాత దైవ దర్శనం చాలా మంచి విషయం", "ఇద్దరూ చాలా అందంగా ఉన్నారు", "ఇదే నిజమైన పవర్ కపుల్" అంటూ అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. ఇక సినిమాల విషయానికి వస్తే, సూర్య ప్రస్తుతం తన తదుపరి ప్రాజెక్టులతో బిజీగా ఉండగా, జ్యోతిక కూడా పలు కీలక కథలపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఒకవైపు సినీ ప్రయాణం, మరోవైపు కుటుంబ జీవితం రెండింటినీ సమతూకంగా కొనసాగిస్తున్న ఈ స్టార్ జంట మరోసారి వార్తల్లో నిలిచింది.


## 'హల్లల్లల్లో'తో సోషల్ మీడియాలో పెద్ది మేనియా..



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'పెద్ది' ప్రమోషన్స్ ప్రస్తుతం దేశవ్యాప్తంగా భారీ హైప్‌ను సృష్టిస్తున్నాయి. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ట్రైలర్, తొలి రెండు పాటలు ప్రేక్షకుల్లో అంచనాలను పెంచగా.. ఇప్పుడు మూడో సాంగ్ 'హల్లల్లల్లో' వచ్చి సోషల్ మీడియాలో కొత్త ట్రెండ్‌కు శ్రీకారం చుట్టింది. గత రెండు రోజులుగా ప్రోమోతోనే వైరల్ అయిన ఈ పాట.. తాజాగా పూర్తి వీడియో విడుదల కావడంతో మెగా అభిమానుల్లో మరింత జోష్ నింపింది. భోపాల్‌లో జరిగిన 'పెద్ది కీ ఆవాజ్' ఈవెంట్‌లో ఈ పాటను గ్రాండ్‌గా లాంచ్ చేస్తారని అభిమానులు భావించారు. అయితే అక్కడ ఆడియో వెర్షన్ మాత్రమే విడుదల చేశారు. దీంతో పూర్తి వీడియో కోసం ఆసక్తిగా ఎదురుచూసిన అభిమానులకు ఇప్పుడు మేకర్స్ సర్‌ప్రైజ్ ఇచ్చారు. విడుదలైన కొద్ది సేపటికే ఈ పాట సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లోకి దూసుకెళ్లింది. "హల్లల్లల్లో... హల్లో హల్లల్లల్లో హల్లల్లో... బావ చీర చొక్కా చిక్కడిపోవాలో..." అంటూ సాగే లిరిక్స్ యూత్‌ను బాగా ఆకట్టుకుంటున్నాయి. రొమాంటిక్ టచ్‌తో పాటు మాస్ ఎనర్జీని కలిపి రూపొందించిన ఈ పాటలో రామ్ చరణ్ స్క్రీన్ ప్రెజెన్స్ మరోసారి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆయన స్టైలిష్ స్టెప్పులు, రా అండ్ రస్టిక్ లుక్ అభిమానులను ఫిదా చేస్తున్నాయి. ఈ పాటకు ప్రముఖ రచయిత అనంత్ శ్రీరామ్ సాహిత్యం అందించగా, గాయని రక్షిత సురేష్ తన గాత్రంతో ప్రత్యేకమైన ఫీల్ తీసుకొచ్చారు. కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ కంపోజ్ చేసిన డ్యాన్స్ మూమెంట్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా రామ్ చరణ్, జాన్వీ కపూర్ కెమిస్ట్రీ పాటకు మరో ప్లస్ పాయింట్‌గా నిలిచింది. ఇక 'పెద్ది' సినిమాపై మొదటి నుంచే భారీ అంచనాలు ఉన్నాయి. 'చికిరి చికిరి', 'రయ్ రయ్ రా రా' పాటల నుంచి ట్రైలర్ వరకు ప్రతి అప్డేట్ అభిమానులను ఆకట్టుకుంది. ముఖ్యంగా ఈ సినిమా క్లైమాక్స్‌పై చిత్రబృందం పదే పదే ఆసక్తికర వ్యాఖ్యలు చేస్తోంది. దర్శకుడు బుచ్చిబాబు రూపొందించిన ఈ ముగింపు సన్నివేశం ప్రేక్షకులకు భారీ సర్‌ప్రైజ్‌గా నిలుస్తుందని చెబుతున్నారు. ప్రమోషన్స్ విషయంలో కూడా చిత్రబృందం ఎక్కడా తగ్గడం లేదు. దేశవ్యాప్తంగా ప్రత్యేక ఈవెంట్లు నిర్వహిస్తూ సినిమాపై మరింత హైప్ క్రియేట్ చేస్తున్నారు. బెంగళూరు, ఢిల్లీ, చెన్నై, విజయనగరం, హైదరాబాద్ నగరాల్లో వరుసగా భారీ ప్రమోషనల్ కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్లాన్ చేశారు.

## 'రౌడీ జనార్ధన'లో 'కన్నప్ప' బ్యూటీ స్పెషల్ సాంగ్!


టాలీవుడ్ రౌడీ బాయ్ విజయ్ దేవరకొండ, టాలెంటెడ్ డైరెక్టర్ రవి కిరణ్ కోలా కాంబినేషన్‌లో వస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'రౌడీ జనార్ధన'. ప్రముఖ నిర్మాత దిల్ రాజు భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మిస్తుండగా.. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించి తాజాగా ఫిల్మ్‌నగర్ వర్గాల్లో ఒక ఇంట్రెస్టింగ్ న్యూస్ తెగ హల్‌చల్ చేస్తోంది. ఈ సినిమాలో మాస్ ఆడియన్స్‌ను ఊపేసే ఒక అదిరిపోయే స్పెషల్ సాంగ్ ఉండబోతోందట. దర్శకుడు రవి కిరణ్ ఈ పాట కోసం ఒక పవర్‌ఫుల్ సిచువేషన్‌ను సిద్ధం చేయగా, అందులో విజయ్ పక్కన స్టెప్పులేసేం దుకు 'కన్నప్ప' ఫేమ్ బ్యూటీ ప్రీతి ముకుందన్‌ను సంప్రదించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆమెతో చర్చలు నడుస్తున్నాయని, అంతా అనుకూలిస్తే రౌడీ హీరోతో కలిసి ప్రీతి ముకుందన్ మాస్ డ్యాన్స్‌తో థియేటర్లలో రచ్చ చేయడం ఖాయమని అంటున్నారు. ఈ సినిమాపై అంచనాలు పెంచే మరో క్రేజీ అప్‌డేట్ ఏంటంటే.. టాలీవుడ్ యాంగ్రీ మ్యాన్, సీనియర్ హీరో రాజశేఖర్ ఈ చిత్రంలో ఒక అత్యంత కీలకమైన పాత్రలో నటిస్తున్నారు. ఆయన క్యారెక్టర్‌ను మునుపెన్నడూ చూడని విధంగా, ఎంతో వైవిధ్యంగా డిజైన్ చేశారట. ముఖ్యంగా రాజశేఖర్ సరికొత్త లుక్ ఈ సినిమాకే పెద్ద హైలైట్‌గా నిలుస్తుందని ఇండస్ట్రీ టాక్. మహానటి కీర్తి సురేష్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ ప్రాజెక్ట్ ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం ఓ వైపు 'రణబాలి' సినిమా చేస్తూనే, మరోవైపు ఈ 'రౌడీ జనార్ధన' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద సాలిడ్ కమర్షియల్ సక్సెస్ అందుకోవాలని విజయ్ దేవరకొండ పూర్తి కసిగా ఉన్నాడు.



## బాక్సాఫీస్ వద్ద 'దృశ్యం 3' సునామీ..

**కేవలం 3 రోజుల్లోనే రూ. 100 కోట్ల క్లబ్‌లో మోహన్‌లాల్!**

మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్, సెన్సేషనల్ డైరెక్టర్ జీతు జోసెఫ్ కాంబినేషన్‌లో వచ్చిన మోస్ట్ అవేటెడ్ సస్పెన్స్ థ్రిల్లర్ 'దృశ్యం 3' బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల సునామీ సృష్టిస్తోంది. థియేటర్లలోకి వచ్చిన కేవలం మూడు రోజుల్లోనే ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ. 100 కోట్ల మార్కును దాటేసి సరికొత్త రికార్డు సృష్టించింది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం మూడో రోజు ముగిసే సమయానికి ఈ చిత్రం గ్లోబల్ వైడ్‌గా ఏకంగా రూ. 117.17 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించడమే కాకుండా, మలయాళ చిత్ర పరిశ్రమలో అత్యంత వేగంగా వంద కోట్ల క్లబ్‌లో చేరిన రెండవ సినిమాగా సరికొత్త చరిత్ర లిఖించింది. బాక్సాఫీస్ లెక్కల విషయానికి వస్తే ఇండియాలో ఈ సినిమా ఇప్పటివరకు రూ. 40.60 కోట్ల నెట్ వసూలు చేయగా, మొదటి రోజుతో పోలిస్తే శని, ఆదివారాల్లో కలెక్షన్లు భారీగా పుంజుకున్నాయి. విదేశాల్లో కూడా ఈ సినిమాకు ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతుండటంతో ఓవర్సీస్ మార్కెట్‌లోనే ఏకంగా రూ. 70 కోట్ల గ్రాస్ కలెక్ట్ చేసి సరికొత్త రికార్డు క్రియేట్ చేసింది. ఎప్పటిలాగే మలయాళ వెర్షన్ రూ. 11.65 కోట్ల నెట్ కలెక్షన్లతో టాప్‌లో నిలవగా, తెలుగు, తమిళ, కన్నడ వెర్షన్లు కూడా మంచి వసూళ్లను సాధిస్తున్నాయి. మిశ్రమ సమీక్షలు వచ్చినప్పటికీ జార్జ్‌కుట్టి పాత్రపై ఉన్న క్రేజ్ ప్రేక్షకులను థియేటర్లకు పరుగులు పెట్టిస్తుండటంతో కేరళలో దాదాపు 67% పైగా అక్యుపెన్సీతో థియేటర్లు హౌస్‌ఫుల్ బోర్డులతో దర్శనమిస్తున్నాయి. ఈ ఘన విజయంపై మోహన్‌లాల్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, గడిచిన 13 ఏళ్లుగా జార్జ్‌కుట్టి కుటుంబంపై ప్రేక్షకులు చూపిస్తున్న ప్రేమ, నమ్మకానికి చేతులెత్తి మొక్కుతున్నానని అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. ఆశీర్వాద్ సినిమాస్ బ్యానర్‌పై ఆంటోనీ పెరుంబావూర్ నిర్మించిన ఈ సినిమాలో మీనా, అన్సిబా, ఎస్తేర్ అనిల్ కీలక పాత్రలు పోషించారు.



Printed, Published & Owned by V. SAI KRISHNAREDDY, Printed at SAI KRISHNA PRINTERS, Door No. 7-7-86/1, Near Collector Chowk, Adilabad (T.S) 504001 Published at H.No. 1-2-125/1, Pithruchaya Nilayam, Shanti Nagar, Adilabad-504001 (T.S) Editor: V. SAI KRISHNA REDDY, RNINO. TELTEL/2012/44706, CELL:7073352171, Email: aksharare khadaily@gmail.com